ANN తెలుగు

Follow: @ANNTELUGU

19-10-2026

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 256 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## నిజామాబాద్ లో నిధి అగర్వాల్

### టీఆర్పీ విశిష్ట గోల్డ్ షోరూం ప్రారంభం

**నిజామాబాద్, మహా :** నిజామాబాద్ సిటీలో మరో గోల్డ్ బ్రాండ్ టీఆర్పీ విశిష్ట అట్టహాసంగా ప్రారంభమైంది. ప్రముఖ నటి నిధి అగర్వాల్ ఈ షోరూం ప్రారంభించగా, నిధిని చూసేందుకు పెద్ద ఎత్తున అభిమానులు తరలివచ్చారు. హైదరాబాద్ లోని కొత్తపేట, జూబ్లిహిల్స్ లో ఇప్పటికే రెండు షోరూంలు నిర్వహిస్తూ గోల్డ్ మార్కెట్ లో విశ్వసనీయత సాధించిన టీఆర్పీ విశిష్ట ఇపుడు తొలిసారి నిజామాబాద్ పట్టణంలో అడుగుపెట్టింది. ప్రముఖ నటి నిధి అగర్వాల్ షోరూం ను ప్రారంభించడంతో పాటు యాజమాన్యాన్ని అభినందించింది. టీఆర్పీ విశిష్ట షోరూంలో గోల్డ్ అవసరం ఉన్నవారు కొనుగోలుచేయవచ్చని సూచించారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా రిబ్బన్ కట్ చేసి

మిగతా 2వ పేజిలో

**టాప్ న్యూస్**



### ఓటు చోరీకి మోదీ ప్లాన్

- అమిత్ షా అమలు
- సీఈసీ ద్వారా కార్యరూపం గోవాలో రాహుల్ గాంధీ ఆరోపణలు

02



### ఏపీలో రాష్ట్రపతి పాలన పెట్టండి

- వైఎస్ జగన్ డిమాండ్

02



### కేంద్రమంత్రి పెమ్మసాని హీరోగా సినిమా

- రాఘవేంద్రరావు ఆసక్తికర ప్రకటన
- రాజకీయ, సినీవర్గాల్లో చర్చ

02



## ఆలయాల అభివృద్ధికి రూ.2,500 కోట్లు

- భద్రాచలం, బాసర ఆలయాలకు భారీగా నిధులు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**ఖమ్మం, మహా :** ఆలయాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. ఖమ్మం జిల్లా ఏన్కూరు నుంచి నాచారం మీదుగా అద్భుత వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రహదారి అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన భూమిపూజ చేశారు. సుమారు రూ.44 కోట్లతో చేపడుతున్న ఈ రహదారి

మిగతా 2వ పేజీలో





## ఫ్యూచర్ సిటీకి మరిన్ని హంగులు

- నేడు సీఎం రేవంత్ పర్యటన
- నూతన పోలీస్ కమిషనరేట్ ప్రారంభోత్సవం

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ఫ్యూచర్ సిటీ' అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణ దిశగా సోమవారం మరో కీలక ఘట్టం చోటుచేసుకోనుంది. సీఎం రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ పరిధిలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా పలు కీలక ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల్లో పాల్గొననున్నారు. సోమవారం మధ్యాహ్నం 3:30 గంటలకు ఇబ్రహీంపట్నంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ను సీఎం రేవంత్ రెడ్డి అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ ప్రాంతంలో శీఘ్రగతిన పెరుగుతున్న పారిశ్రామిక, సాంకేతిక అవసరాలకు అనుగుణంగా భద్రతను బలోపేతం చేసేందుకు ఈ కమిషనరేట్ ఎంతగానో ఉపయోగపడనుంది. ఇక యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీని సీఎం

మిగతా 2వ పేజీలో



## ట్యాంక్‌బండ్‌పై అంగరంగ వైభవంగా.. ధూంధాంగా సద్దుల బతుకమ్మ సంబురాలు

- తెలంగాణ సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో భారీ కార్యక్రమం
- వేడుకలకు హాజరైన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, మంత్రులు జూపల్లి, సీతక్క
- ప్రత్యేక ఆకర్షణగా విజయ్ దేవరకొండ, రష్మిక
- తెలంగాణ కోడలిగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నానన్న రష్మిక

**హైదరాబాద్ , మహా :** మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ వేడుకలను అట్టహాసంగా నిర్వహించింది. హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ సమీపంలో ట్యాంక్ బండ్ వద్ద భారీ ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమానికి సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై వేడుకకు మరింత వన్నె తెచ్చారు. కళాకారులు మహిళలు బతుకమ్మను తలపై పెట్టుకుని ఊరేగింపుగా ప్రధాన వేదిక వద్దకు చేరుకున్నారు. తెలంగాణ సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుక ట్యాంక్‌బండ్ వద్ద ఘనంగా జరిగింది. గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులు, మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, సినీ నటుడు విజయ్ దేవరకొండ, రష్మిక దంపతులు హాజరయ్యారు. మన పూర్వీకులు ఇచ్చిన వారసత్వ సంపద సంస్కృతి సంప్రదాయాలు నేటితరానికి అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. నీటి వృథాను అరికట్టి, జల వనరులను సంరక్షించుకోడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా

మిగతా 3వ పేజీలో





## విజయవాడ మేయర్ బరిలో వంగవీటి రాధాకృష్ణ.

- కూటమి ఉమ్మడి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు.
- చంద్రబాబు, పవన్ సహకారంతో నగరాభివృద్ధికి హామీ.

విజయవాడ, మహా. విజయవాడ మేయర్ పదవికి జనసేన పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ ఆదివారం కూటమి ఉమ్మడి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. తెలుగుదేశం,

మిగతా 2వ పేజీలో

## ఏపీలో ముగిసిన నామినేషన్ల పర్వం

### రాయచోటి సహా పలు చోట్ల ఏకగ్రీవం

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసింది. చెదురుమదురు ఘటనల మధ్య అభ్యర్థులు తమ నామినేషన్లను నమోదు చేశారు. ఆదివారం చివరి రోజు కావడంతో భారీ సంఖ్యలో నామినేషన్లు నమోదు అయ్యాయి. ఆర్వో కార్యాలయాల వద్ద ఈ మధ్యాహ్నం 3 గంటల వరకూ ఎవరైతే క్యూలో ఉన్నారో వాళ్లందరికీ

మిగతా 2వ పేజీలో



## తీరొక్కపూలతో బతుకమ్మల అలంకరణ

- హైదరాబాద్ లో పాల్గొన్న రష్మిక.. కరీంనగర్ లో పాల్గొన్న పీవీ సింధు
- రాష్ట్రవ్యాప్తంగా వైభవంగా వేడుకలు
- హుస్నాబాద్ లో సంబురాల్లో పాల్గొన్న మంత్రి పొన్నం
- సిద్దిపేటలో హరీష్ రావు, సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు
- ఖైరతాబాద్ లో మహిళలకు శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ ఇన్ ఛార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి

05





# ఓటు చోరీకి మోదీ ప్లాన్

- అమిత్ షా అమలు
- సీఈసీ ద్వారా కార్యరూపం
- గోవాలో రాహుల్ గాంధీ ఆరోపణలు



**గోవా** : ఓట్లచోరీకి పాల్పడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ త్వరలోనే చట్టం ముందు నిలవాల్సి వస్తుందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. వారు తమ తప్పులకు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. గోవాలోని మర్గావ్‌లో జరిగిన కాంగ్రెస్ గోయ్ రఖోన్ యాత్రలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. కాంగ్రెస్ శ్రేణులతో కలిసి 2కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించిన రాహుల్ జ్ఞానేశ్ కుమార్ ఓట్ల చోరీకి పాల్పడుతుంటే మోదీ, అమిత్ షా ఆయనకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ రాజ్యాంగాన్ని పరిరక్షించే శక్తి అని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మోదీ, షా, జ్ఞానేశ్ కుమార్‌లను వదిలిపెట్టేది లేదని రాహుల్ గాంధీ తేల్చిచెప్పారు. ఓటు చోరీ విషయంలో ఇక ఎలాంటి సందేహాలకు తావులేదు. మోదీ తెరవెనుక ప్రణాళికలు రచిస్తే, అమిత్ షా వాటిని నిర్వహిస్తున్నారు. సీఈసీ అమలు చేస్తున్నారు. మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్ మా నుంచి తప్పించుకోలేరు. రాజ్యాంగాన్ని పరిరక్షించే బాధ్యత కాంగ్రెస్‌పై ఉంది. నాపై 45కు పైగా పరువునష్టం కేసులు ఉన్నాయి. వాటిలో మోదీ, అమిత్ షాలకు సంబంధించిన వ్యక్తులు దాఖలు చేసిన కేసులే ఉన్నాయి. అయితే, ప్రధానమంత్రి ఓటు చోరీకి పాల్పడ్డారని నా ఆరోపణపై ఇప్పటివరకు కేసు నమోదు కాలేదు. ఈ అంశంపై కేసు పెడితే అది పూర్తిస్థాయి న్యాయపరమైన వ్యవహారంగా మారుతుందనే భయంతోనే వెనుకడుగు వేస్తున్నారు. మధ్యప్రదేశ్, హరియాణా, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బంగాల్, అసోంలలో ఓటు చోరీ జరిగిందని ఆధారాలతో సహా నిరూపించాం. ప్రతిపక్షాలకు చెందిన ఓట్లను తొలగించడం, అధికార పార్టీకి అనుకూలంగా ఓట్లు చేర్చారు. ఓటర్లను ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు మార్చారు. ఇతర రాష్ట్రాల నుంచి ఓటర్లను తీసుకురావడం వంటి అక్రమాలు జరిగాయి. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత మాపై ఉంది" అని రాహుల్ గాంధీ అన్నారు.



# కేంద్రమంత్రి పెమ్మసాని హీరోగా సినిమా

- రాఘవేంద్రరావు ఆసక్తికర ప్రకటన
- రాజకీయ, సినీవర్గాల్లో చర్చ

**విజయవాడ, మహా** : కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హీరో, నిర్మాతగా ఓ సినిమా చేయాలని తాను భావిస్తున్నానని ప్రముఖ దర్శకుడు రాఘవేంద్రరావు పేర్కొన్నారు. పెమ్మసాని ముందుకు వస్తే తాను సినిమా చేసి పెట్టడానికి సిద్ధంగా ఉన్నానని వ్యాఖ్యానించారు. విజయవాడ ఉత్సవ్ 2.0 వేదికపైకి వచ్చాక తనకు ఓ మూవీ స్టోరీ ఆలోచన వచ్చిందని తెలిపారు. విజయవాడ పున్నమిఘాట్, సింగ్‌నగర్ ఎంబీకే స్టేడియంలో వైభవంగా విజయవాడ ఉత్సవ్ 2.0 జరుగుతోంది. సందర్శకులకు అద్భుతమైన కళాప్రదర్శనలు కనువిందు చేస్తున్నాయి. ఆదివారం విజయవాడ ఉత్సవ్ 2.0లో రాఘవేంద్రరావు పాల్గొని, మాట్లాడారు. విజయవాడతో తనకు ఎంతో అనుబంధం ఉందని వెల్లడించారు. విజయవాడ ఉత్సవ్ ద్వారా నేడు నగరం ఎంతగానో కళకళలాడుతోందని రాఘవేంద్రరావు చెప్పుకొచ్చారు. జాతీయ, రాష్ట్ర అవార్డులను చాలావరకు తాను తీసుకున్నానని ప్రస్తావించారు. నేడు విజయవాడ ఉత్సవ్‌లో ఈ అవార్డు అందుకోవడం తనకు ప్రత్యేకంగా ఉందని తెలిపారు. తాను విజయవాడ అమెరికన్ ఆస్పత్రిలో జన్మించానని గుర్తుచేసుకున్నారు. దివంగత మాజీ సీఎం నందమూరి తారక రామారావు పుట్టిన నేలపై తానూ పుట్టడం తన అదృష్టమని వ్యాఖ్యానించారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలని ఆకాంక్షించారు. తనకు విజయవాడ నగరం, కృష్ణానది ఎన్నో అనుభూతులను ఇచ్చిందని రాఘవేంద్రరావు తెలిపారు.

# విజయవాడ మేయర్ బరిలో వంగవీటి రాధాకృష్ణ.

( మొదటి పేజీ తరువాయి )



జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి తన కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు.

**కూటమి నేతల ఆమోదంతో బరిలోకి.**
నామినేషన్ అనంతరం వంగవీటి రాధాకృష్ణ మీడియాతో మాట్లాడుతూ.. తనను విజయవాడ మేయర్ అభ్యర్థిగా ఎంపిక చేసిన జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బీజేపీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తన అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపిన మెగా స్టార్ చిరంజీవికి ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పారు. రాజకీయంగా కీలకమైన విజయవాడ నగరానికి మేయర్ అభ్యర్థిగా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

**నగరాభివృద్ధికి ప్రాధాన్యం.**
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, నగరంలోని ముగ్గురు శాసనసభ్యుల సహకారంతో విజయవాడను మరింత అభివృద్ధి చేస్తామని రాధాకృష్ణ హామీ ఇచ్చారు. నగరానికి మంచి పేరు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ఎన్నికల్లో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

**వంగవీటి కుటుంబానికి రాజకీయ నేపథ్యం.**
దివంగత నాయకుడు వంగవీటి మోహనరంగా కుమారుడైన రాధాకృష్ణ గతంలో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పనిచేశారు. ఇటీవల జనసేన పార్టీలో చేరిన ఆయనకు విజయవాడ మేయర్ అభ్యర్థిగా అవకాశం కల్పించారు. ఇప్పుడు కూటమి ఉమ్మడి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడంతో నగర ఎన్నికల్లో ఆయన పోటీ కీలకంగా మారింది.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**..మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**




బెల్లంపల్లి, మహా:ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.ఆదివారం జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలో గల 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను, రోగుల పరిస్థితి, ఆసుపత్రికి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వ్యాధుల వివరాలు తెలుసుకుని వైద్యులకు పలు సూచనలు చేశారు. వార్డులను స్వయంగా పరిశీలించి, రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యం, సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పండుగల వేళలలో కూడా ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతిరోజు వైద్యులు తప్పనిసరిగా విధులలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అత్యవసర వైద్య సేవల కోసం ఎమర్జెన్సీ వార్డు నిరంతరం తెరిచి ఉంచాలని, కనీసం ఒక మెడికల్ డాక్టర్ విధిగా అందుబాటులో ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ రవికుమార్ తోపాటు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీకి మరిన్ని హంగులు

(మొదటి పేజీ తరువాయి )

సందర్శించి, అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. ఇప్పటికే ఫ్యూచర్ సిటీలో ఎఫ్ సిడిఏ కార్యాలయం ప్రారంభం కాగా, రేడియల్ రోడ్ల పనులు వేగంగా జరుగుతున్నాయి.

**ఎన్ యుఎంకు క్యాంపస్‌కు శంకుస్థాపన..**
ఫ్యూచర్ సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యునానీ మెడిసిన్ నూతన క్యాంపస్ నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి సోమవారం భూమిపూజ చేసి శంకుస్థాపన చేయనున్నారు. పర్యటన ముగింపులో భాగంగా ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్, మౌలిక వసతుల కల్పన, కనెక్టివిటీ, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ఇబ్రహీంపట్నం, ఫ్యూచర్ సిటీ పరిసర ప్రాంతాల్లో అధికారులు భారీ భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశారు.








# నిజామాబాద్ లో నిధి అగర్వాల్

( మొదటి పేజీ తరువాయి )

ప్రారంభించగా, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా కూడా షోరూం ను సందర్శించి నిర్వాహకులు పాలభట్ల ఆనంద్, అభినందించారు. అనేకమంది ప్రముఖులు షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా రాగా, షోరూం కిటకిటలాడింది. నిధి అగర్వాల్ తన మాటలు, ఆటపాటలతో ఉత్సాహపరిచారు. నిజామాబాద్ లో విశిష్ట ప్రారంభోత్సవం హాట్ టాపిక్ గా ఆసక్తికర చర్చకు దారితీసింది. మోడల్ యాక్టివిటీ, బ్రాండింగ్ లో విశిష్ట నిజామాబాద్ లో కొత్త బెంచ్ మార్క్ సెట్ చేసింది. బ్రాండ్ ఎక్స్ వో ఫౌండర్ కంది రామచంద్రారెడ్డి, ఆర్ బిఎం ఫౌండర్ శివప్రసాద్ లు టీఆర్పి విశిష్ట యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. నూతన వ్యాపారం రాకెట్ వేగంతో పురోగమించాలని ఆకాంక్షించారు.



# ఏపీలో ముగిసిన నామినేషన్ల పర్వం

( మొదటి పేజీ తరువాయి )

నామినేషన్లు నమోదు చేసేందుకు అవకాశం కల్పించారు. నామినేషన్ల వేసేందుకు ఇబ్బందులు పడ్డ అభ్యర్థులతో ఎన్నికల అధికారులు మాట్లాడారు. సోమవారం నుంచి నామినేషన్ల పరిశీలన ప్రక్రియ ప్రారంభంకానుంది. ఈ నెల 21న ఉపసంహరణ ప్రక్రియ సాగనుంది. 28న పోలింగ్ జరగనుంది. 30 ఎన్నికల ఫలితాలు విడుదల చేయనున్నారు. రాయచోటి సహా అనేక మునిసిపాలిటీల్లో ప్రత్యర్థులు నామినేషన్లు వేయకపోవడం, పలుచోట్ల అడ్డగించడంతో ఏకగ్రీవాలు జరిగాయి. విజయవాడలో ఏబీ వెంకటేశ్వరరావు కూటమికి ట్విస్ట్ ఇచ్చారు. స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేయడమే కాకుండా కాంగ్రెస్, వామపక్షాల మద్దతు కూడగట్టారు. వంగవీటి రాధా ఏకపక్షంగా గెలిచేవాతావరణమున్న దశలో ఏబీ మళ్ళీ షాకిచ్చారన్న చర్చ జరుగుతోంది.




**మంత్రి రాంప్రసాద్ రెడ్డి అభినందనలు**
రాయచోటి మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా విజయం సాధించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన ఆకాంక్షించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరుపై విమర్శలు గుప్పించారు. గతంలో వైసీపీ నాయకులు వ్యవహరించిన తీరుకు ప్రజలు తగిన సమాధానం చెబుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల తీర్పే అంతిమమని, ప్రజల అభిప్రాయాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉంటుందని పేర్కొన్నారు. రాజకీయాల్లో దౌర్జన్యాలు, ఒత్తిళ్లకు తావు ఉండకూడదని, ప్రజల విశ్వాసాన్ని పొందిన వారికే రాజకీయంగా ఆదరణ లభిస్తుందని రాంప్రసాద్ అభిప్రాయపడ్డారు.

# ఆలయాల అభివృద్ధికి రూ.2,500 కోట్లు

(మొదటి పేజీ తరువాయి )

నిర్మాణంతో భక్తుల రాకపోకలకు సౌకర్యం కలగడంతో పాటు, స్థానికంగా వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ పాల్గొన్నారు.

**ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు.**
రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం సుమారు రూ.2,500 కోట్లు వెచ్చిస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతంలోని ఆలయాల అభివృద్ధికి రూ.2,000 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. భద్రాచలం దేవస్థానం సమగ్ర అభివృద్ధికి రూ.276 కోట్లు, బాసర సరస్వతీ అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.354 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయాల ప్రాధాన్యాన్ని మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**రాష్ట్రవ్యాప్తంగా రహదారుల నిర్మాణం.**
రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి రూ.90 వేల కోట్లతో పనులు చేపడుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. రహదారులు మెరుగుపడితే గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు పెరగడంతో పాటు వాణిజ్యం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ఏన్కూరు-నాచారం రహదారి నిర్మాణం అద్భుత వెంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఉపయోగపడుతుందని, స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరిగేందుకు దోహదం చేస్తుందని తెలిపారు.

**సంక్షేమ పథకాల అమలుకు ప్రాధాన్యం.**
రాష్ట్రంలో కోటి ఆరు లక్షల కుటుంబాలకు ప్రతి వ్యక్తికి నెలకు ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచిత వైద్య చికిత్స పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు పేర్కొన్నారు. రైతు భరోసా కింద 71 లక్షల మంది రైతుల ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌తో 53 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కలుగుతోందని వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద పేద కుటుంబాలకు ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు.



**విద్య, ఆరోగ్య రంగాలకు ప్రాధాన్యం.**
ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం, పాలు లేదా రాగిజావ అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో సమీకృత నివాస పాఠశాలలను నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

**నీటి పొదుపుపై ప్రజలకు విజ్ఞప్తి.**
వాతావరణ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు తగ్గే ప్రమాదం ఉందని, వచ్చే ఏడాది జూలై వరకు నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు నీటిని పొదుపుగా వినియోగించాలని భట్టి విక్రమార్క కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. నవంబరు 19న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

**అభివృద్ధి పనులకు మరిన్ని ప్రతిపాదనలు.**
ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తోందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హులైన ఓటర్లు నవంబరు 6లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ నాచారం నుంచి జూలూరుపాడు వరకు రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు. ఈ రహదారి నిర్మాణం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని పలు మండలాలకు అనుసంధానాన్ని మెరుగుపరుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాలకు రూ.3.38 కోట్ల బ్యాంకు లింకేజీ రుణ చెక్కును భట్టి విక్రమార్క అందజేశారు. అంతకుముందు అద్భుత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# ఏపీలో రాష్ట్రపతి పాలన పెట్టండి వైఎస్ జగన్ డిమాండ్

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని వైసీపీ అధినేత జగన్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో రాజ్యాంగ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని, ప్రజాస్వామ్యాన్ని అధికార పార్టీ ఖూనీ చేస్తోందని ఆదివారం ఆయన తీవ్రంగా ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కరవయ్యాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు కనుసన్నల్లోనే రాష్ట్ర ఎన్నికల సంఘం పనిచేస్తోందని జగన్ విమర్శించారు. నామినేషన్ కేంద్రాల వద్ద టీడీపీ వర్గాలు మాటువేసి, వైసీపీ అభ్యర్థులను దౌర్జన్యంగా అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. కేవలం రెండు రోజుల ముందు రిజర్వేషన్లు ప్రకటించి, 24 గంటల్లో నామినేషన్లు వేయమనడం ప్రతిపక్షానికి సమయం ఇవ్వకూడదనే కుట్రలో భాగమేనని ఆరోపించారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో ఎస్ఈసీగా నిమ్మగడ్డ రమేశ్ కుమార్ ఉన్నప్పుడు కలెక్టర్లు, ఎస్పీలను బదిలీ చేసినా తాము ధైర్యంగా ఎన్నికలకు వెళ్లి విజయం సాధించామని జగన్ గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి ఆ ధైర్యం లేదని విమర్శించారు. అన్నమయ్య జిల్లా పుంగనూరులో జరిగిన ఘర్షణల నేపథ్యంలో ఈ వివాదం మరింత ముదిరింది. వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి తన పార్టీ అభ్యర్థులతో నామినేషన్ వేయడానికి వెళ్లినప్పుడు టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తీవ్ర ఘర్షణలు చెలరేగాయి. ఈ హింసకు వైసీపీనే కారణమని టీడీపీ ఆరోపిస్తుండగా, తమ ఎంపీపైనే దాడి జరిగిందని వైసీపీ ప్రత్యారోపణలు చేస్తోంది. అయితే, నిబంధనలకు విరుద్ధంగా ఎంపీ మిథున్ రెడ్డి వందలాది మంది అనుచరులతో రావడం వల్లే ఉద్రిక్తత తలెత్తిందని పోలీసులు తెలిపారు.

# వియన్నాలో ఘనంగా బతుకమ్మ–దసరా వేడుకలు

వియన్నా, ఆస్ట్రియా: తెలుగు సంగం ఆస్ట్రియా ఆధ్వర్యంలో అధ్యక్షురాలు శ్రీమతి శ్రీలత కొమటి రెడ్డి మరియు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుల సమన్వయంతో అక్టోబర్ 17న వియన్నాలో బతుకమ్మ-దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆస్ట్రియాలో నివసిస్తున్న తెలుగు కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా బతుకమ్మను నిర్వహించి, దసరా పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను విదేశాల్లోనూ పరిరక్షించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళలు బతుకమ్మ పాటలు, నృత్యాలతో సందడి చేయగా, చిన్నారులు, యువత సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సంప్రదాయ తెలుగు వంటకాలతో ఏర్పాటు చేసిన పాట్లక్ భోజనం, సంగీత కార్యక్రమాలు, లక్కీ డ్రా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమ విజయానికి తెలుగు సంగం ఆస్ట్రియా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, వాలంటీర్లు, అలంకరణ బృందం, రిజిస్ట్రేషన్ బృందం మరియు సభ్యులు సమిష్టిగా కృషి చేశారు. స్పాన్సర్లు, శ్రేయోభిలాషులు అందించిన సహకారం కూడా వేడుకల నిర్వహణకు తోడ్పడింది. ఈ సందర్భంగా అధ్యక్షురాలు శ్రీలత కొమటి రెడ్డి మాట్లాడుతూ, విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడం, తెలుగు వారందరినీ ఒకే కుటుంబంలా కలిపి ఉంచడం తమ సంఘం ప్రధాన లక్ష్యమని తెలిపారు. సభ్యులు, ఎగ్జిక్యూటివ్ కమిటీ, వాలంటీర్లు, స్పాన్సర్లు అందించిన సహకారానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. “కలిసి పనిచేశాం... కలిసి సంబరాలు జరుపుకున్నాం... కలిసి మధుర జ్ఞాపకాలను సృష్టించుకున్నాం” అనే స్ఫూర్తితో వేడుకలు ఆనందంగా ముగిశాయి. ఆస్ట్రియాలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు తెలుగు సంగం ఆస్ట్రియా తన కార్యక్రమాలను కొనసాగించనుంది.





## రామగిరి ఖిల్లా వద్ద వాకింగ్, ట్రెక్కింగ్ కార్యక్రమం

**జెండా ఊపి ప్రారంభించిన గోదావరిఖని ఏసీపీ మడత రమేష్**

**పెద్దపల్లి మహా:** రామగిరి: 'మన జిల్లా - మన రామగిరి' కార్యక్రమంలో భాగంగా రామగిరి ఖిల్లా వద్ద నిర్వహించిన వాకింగ్, ట్రెక్కింగ్ కార్యక్రమాన్ని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మడత రమేష్ మాట్లాడుతూ.. చారిత్రక ప్రాధాన్యత కలిగిన రామగిరి ఖిల్లా విశిష్టతను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, ఈ ప్రాంతాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. రామగిరి ఖిల్లా చారిత్రక ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడం, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడం, స్థానిక ప్రాంత విశిష్టతను వెలుగులోకి తీసుకురావడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా రామగిరి ఖిల్లాకు మరింత గుర్తింపు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



## పోయిరావమ్మ,బతుకమ్మ.. మళ్లీ ఏడాదికి తిరిగిరావమ్మ...

మురిపించిన గౌరమ్మ.. ముగిసిన పూల బతుకమ్మ జాతర.... రాజేంద్రనగర్ మహా ; తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ అక్టోబర్ 18, ఆదివారం రోజున "సద్దుల బతుకమ్మ" (పెద్ద బతుకమ్మ) వేడుకలతో అత్యంత వైభవంగా ముగిసాయి. భాద్రపద బహుళ అమావాస్య (అక్టోబర్ 10) నాడు 'ఎంగిలిపూల బతుకమ్మ'తో ప్రారంభమైన ఈ తొమ్మిది రోజుల పూల జాతర, ఆశ్వయుజ శుద్ధ అష్టమి (దుర్గాష్టమి) తో సద్దుల బతుకమ్మతో సంపూర్ణమవుతుంది. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని శంషాబాద్ సర్కిల్ పరిధిలో,శంషాబాద్ మండలం చౌదర్ గూడ, పాలమాకుల, జూక్కల్, నర్కుడా, మల్కరం,కవ్వగూడా, మైలార్ దువ్వల్లి లక్ష్మీ గూడా, వుడెమ్ గడ్డ, శ్రీరామ్నగర్ కాలనీ, ఏక్తా కాలనీ, కాటేదాన్, సాయిబాబా నగర్, ప్రగతీ కాలినీ,బాబుల్ రెడ్డి నగర్, నేతాజీ నగర్,దుర్గ నగర్ బృందావన్ కాలనీ, భవాని కాలనీ, ప్రేమాతీపేట, బుద్వేల్ , పద్మశాలిపురం,లలో మహిళలు గుమ్మడి ఆకులు, తంగేడు, గునుగు, కట్ల, బంతి, చామంతి వంటి రంగురంగుల పూలతో పెద్ద బతుకమ్మలను అందంగా పేర్చి, గౌరమ్మకు అన్నంతో చేసిన ఐదు రకాల సద్దులను (నువ్వుల సద్ది, పల్లీల సద్ది, కొబ్బరి సద్ది, నిమ్మకాయ సద్ది, చింతపండు పులిహోర) నైవేద్యంగా సమర్పించి, మహిళలందరూ సాంప్రదాయ దుస్తులు, ఆభరణాలు ధరించి, బతుకమ్మలను ఒకచోట చేర్చి వాటి చుట్టూ తిరుగుతూ చప్పట్లతో, లయబద్ధంగా జానపద పాటలు పాడారు. చీకటి పడ్డాక పోయిరావమ్మ బతుకమ్మ.. సాగిపోవమ్మ.. మళ్లీ ఏడాదికి తిరిగిరావమ్మ" అంటూ సమీపంలోని కుంటలు చెరువులలో నిమజ్జనం చేస్తారు.



## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగ

**బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్**

మట్వాడ, మహా : తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రకృతి ఆరాధనకు నిలువెత్తు ప్రతీక బతుకమ్మ పండుగ అని బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ అన్నారు. ఆదివారం సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని పోతన నగర్ సంస్కార భారతి ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ ఆట స్థలానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆట స్థలంలో రంగు రంగుల పూలతో అలంకరించిన బతుకమ్మల మధ్య సంప్రదాయబద్ధంగా ఆటపాటలతో సందడి చేస్తున్న ఆడపడుచులను ఆయన కలుసుకుని, వారికి సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, శ్రీ దుర్గదేవి అమ్మ వారి ఆశీస్సులతో, బతుకమ్మ తల్లి కరుణతో జిల్లాలోని ప్రతి ఇల్లూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. సనాతన ధర్మంలో మహిళలకు ఇచ్చే గౌరవానికి, నారీశక్తి కి ఈ పండుగ ఒక నిదర్శనమని ఆయన కొనియాడారు. తెలంగాణ ఆడబిడ్డల జీవితాల్లో బతుకమ్మ పండుగ సరికొత్త వెలుగులు నింపాలని కోరుకుంటూ, ఈ వేడుకలను ఇంత ఘనంగా నిర్వహిస్తున్న బందెల మోహన్ రావు కు, అలాగే నిర్వాహకులకు గంట రవికుమార్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## వైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**మందమర్రి, ప్రతినిధి:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ముగింపు వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమైన పూల పండుగ సద్దుల బతుకమ్మతో ముగిసింది. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, కొత్త దుస్తులు ధరించి సంప్రదాయ పాటలు, కోలాటాలు, డీజే పాటలతో సందడి చేశారు. గౌరమ్మకు ఐదు రకాల సద్దులను నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మలను ఊరేగింపుగా చెరువులు, జలాశయాల వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఒకరికొకరు వాయినాలు ఇచ్చుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రకృతి ఆరాధన, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలిచిన ఈ



వేడుకలతో గ్రామాలు, పట్టణాల్లో పండుగ సందడి నెలకొంది.

# ట్యాంక్‌బండ్‌పై అంగరంగ వైభవంగా.. ధూంధాంగా సద్దుల బతుకమ్మ సంబురాలు

( మొదటి పేజీ తరువాయి )

తీసుకోవాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లా సందేశం ఇచ్చారు. ప్రజలందరికీ బతుకమ్మ పండగ శుభాకాంక్షలు చెప్పిన ఆయన అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అమరవీరుల స్థూపం నుంచి కళాకారులు, మహిళలతో కలిసి మంత్రి సీతక్క బతుకమ్మలను ఊరేగింపుగా ట్యాంక్‌బండ్ వద్దకు తీసుకువచ్చి అక్కడ వారంతా ఆడి పాడారు. ప్రకృతి, పండగలను కాపాడుకుంటూ అందరం ఆనందంగా ఆరోగ్యంగా ఉండాలని సీతక్క ఆకాంక్షించారు.

**ప్రత్యేక ఆకర్షణగా విజయ్, రష్మిక దంపతులు**

వేడుకకు సినీ నటులు విజయ్ దేవరకొండ, రష్మికలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వారికి సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి సీతక్క సన్మానించారు. వేడుకలకు పిలవగానే వచ్చిన విజయ్ రష్మికలను జూపల్లి అభినందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మన సంస్కృతి, పండగలను ప్రపంచ ప్రాచుర్యం పొందేలా ఘనంగా నిర్వహిస్తున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అనంతరం మాట్లాడిన విజయ్ రష్మికలు ప్రజలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. తెలంగాణ కోడలిగా బతుకమ్మ పండుగలో పాల్గొని అందరితో ఆడి పాడడం అదృష్టంగా భావిస్తున్నట్లు రష్మిక తెలిపారు.

**బతుకమ్మ పండుగ స్ఫూర్తితో ప్రకృతి, జలవనరుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి : గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా**

నీటి వృథాను అరికట్టి, జలవనరులను సంరక్షించుకోవడాన్ని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. బతుకమ్మ తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి, మహిళా శక్తికి, ప్రకృతి పట్ల ప్రజలకున్న ఆరాధనా భావానికి ప్రతీక అనిపేర్కొన్నారు. ఎల్‌నినో వంటి వాతావరణ పరిణామాల నేపథ్యంలో ప్రకృతి పరిరక్షణ ఆవశ్యకత మరింత పెరిగిందని గవర్నర్ తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రంలో తక్కువ వర్షపాతం నమోదవడం భవిష్యత్తులో నీటి సంక్షోభంపై హెచ్చరికగా భావించాలన్నారు. నీటి ఎద్దడి తీవ్రమయ్యే వరకు వేచి చూడకుండా ఇప్పటి నుంచే నీటి పొదుపును అలవాటు చేసుకోవాలని సూచించారు.

వర్షపు నీటిని ఒడిసిపట్టడం, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం, చెరువులను పరిరక్షించడం, భూగర్భ జలాలను పెంపొందించడం వంటి చర్యలకు ప్రాధాన్యమివ్వాలని పిలుపునిచ్చారు. జల సంరక్షణ ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి కర్తవ్యమని స్పష్టం చేశారు. ప్రస్తుత నీటి లభ్యతకు అనుగుణంగా వ్యవసాయంలో మార్పులు చేసుకోవాలని గవర్నర్ రైతులకు సూచించారు. అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా స్థానిక వాతావరణానికి అనుకూలమైన, తక్కువ నీటితో పండే పంటలను ప్రోత్సహించాలని కోరారు.

బతుకమ్మ పండుగ స్ఫూర్తితో ప్రకృతి, జలవనరుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, భావితరాలకు సురక్షితమైన, సుభిక్షమైన భవిష్యత్తును అందించేందుకు సమష్టిగా ముందుకు రావాలని గవర్నర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలందరికీ బతుకమ్మ, నవరాత్రి, విజయదశమి శుభాకాంక్షలు





తెలిపారు. అమ్మ గౌరీ అనుగ్రహంతో రాష్ట్రంలోని ప్రతి ఇంటా సుఖశాంతులు, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

**మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ : మంత్రి సీతక్క**

బతుకమ్మ పండుగ మహిళల ఆత్మగౌరవానికి, ఐక్యతకు ప్రతీక అని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఎన్ని కష్టాలు, కరువు పరిస్థితులు ఎదురైనా తెలంగాణ మహిళలు మొక్కవోని ధైర్యంతో తమ సంప్రదాయాలను కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రతి ఆడబిడ్డ గౌరమ్మలా గౌరవించబడాలని ఆకాంక్షించారు. కుటుంబాల్లోనే కాకుండా మహిళలు పనిచేసే ప్రతి చోటా వారికి తగిన గౌరవం, ఆదరణ లభించాలని అన్నారు.

బతుకమ్మ పండుగ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేస్తూ, దూరమైన బంధుమిత్రులను కలిపే వేడుకగా నిలుస్తుందని సీతక్క పేర్కొన్నారు. పుట్టింటికి, అత్తింటికి మధ్య అనుబంధాలను బలోపేతం చేసే ఈ పండుగ గ్రామీణ సమైక్య జీవన విధానానికి సజీవ సాక్ష్యమన్నారు. ప్రకృతి, పూలు, చెరువులు, పంటలతో ముడిపడిన బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని వివరించారు. తెలంగాణ సంస్కృతిని పట్టణాలు, పల్లెల్లో సమానంగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 1

**జానపద కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి : మంత్రి జూపల్లి కృష్ణారావు**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జానపద కళారూపాలకు దేశవ్యాప్తంగా,ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. బతుకమ్మ తెలంగాణ రాష్ట్ర పండుగ అని, మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని మంత్రి అన్నారు. రంగురంగుల పూలను పేర్చి ప్రకృతిని పూజించే ఈ పండుగ కులమతాలకు అతీతంగా ప్రజలందరినీ ఒకచోట చేర్చి ఐక్యతను చాటుతుందని పేర్కొన్నారు. బతుకమ్మ పాటలు, ఆటలు, పూల అలంకరణలు, జానపద కళారూపాలు తెలంగాణ సంస్కృతి వైభవాన్ని ప్రతిబింబిస్తాయని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తోందన్నారు. తెలంగాణ అమరవీరుల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. తరతరాలుగా వస్తున్న సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించడం ప్రభుత్వంతోపాటు సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. తెలంగాణ జానపద గేయాలు ప్రస్తుతం సోషల్ మీడియా రీల్స్ నుంచి సినిమా పాటల వరకు విశేష ప్రజాదరణ పొందుతున్నాయని జూపల్లి కృష్ణారావు అన్నారు. ఒకప్పుడు ప్రాంతీయ భాషల్లోని పాటలకు పరిమితమైన ఆదరణ ఉండేదని, ప్రస్తుతం తెలంగాణ జానపద గేయాలు దేశవ్యాప్తంగా ప్రజలను ఆకట్టుకుంటున్నాయని పేర్కొన్నారు. గద్దర్, సుద్దాల అశోక్ తేజ వంటి ప్రముఖుల నుంచి నేటి గాయకులు, గేయ రచయితల వరకు అనేక మంది కళాకారులు తెలంగాణ భాష, యాస, సంస్కృతిని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని అభినందించారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ కవులు, రచయితలు, గాయకులు, కళాకారులు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. కళాకారులను గౌరవించడం అంటే మన సంస్కృతిని గౌరవించడమేనని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ కళారూపాలకు మరింత ప్రాచుర్యం కల్పించడంతోపాటు, కళాకారులను ప్రోత్సహించి వారి ప్రతిభను భావితరాలకు పరిచయం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మన భాష, యాస, పల్లె జీవనశైలి, జానపద సంపదను ప్రపంచానికి పరిచయం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.

**త్వరలో 'ప్రభాత భేరి'**

సమాజంలో ఆర్థిక క్రమశిక్షణ, ఆలోచనా విధానంలో మార్పు రావాల్సిన అవసరం ఉందని మంత్రి జూపల్లి అన్నారు. సంస్కృతి అంటే కేవలం ఆటపాటలు మాత్రమే కాదని, అది మన జీవన విధానానికి, ఆలోచనా విధానానికి ప్రతిబింబమని వివరించారు. ప్రతి కుటుంబంలో సంతోషం శాశ్వతంగా ఉండాలంటే ఆర్థిక విషయాల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. అవసరం ఉన్నా లేకున్నా అనవసర ఖర్చులు చేయడం, గొప్పలకు పోయి అప్పులు చేయడం వల్ల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంటున్నాయని పేర్కొన్నారు. విద్య, వైద్యం వంటి ముఖ్యమైన అంశాలకు ప్రాధాన్యమిస్తూ, అవసరాలకు అనుగుణంగా ఖర్చులు చేయాలని సూచించారు. ప్రతి ఆడబిడ్డ ముఖంలో పండుగ రోజు కనిపించే సంతోషం ఏడాది పొడవునా ఉండాలంటే సమాజంలో ఆలోచనా విధానంలో మార్పు రావాలని అభిప్రాయపడ్డారు. ఈ లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో త్వరలో 'ప్రభాత భేరి' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు, కళాకారులు, సినీ ప్రముఖులు భాగస్వాములై తమ సహకారం అందించాలని కోరారు. సమాజంలో ఉన్న సామాజిక రుగ్మతలను ప్రభుత్వాలు మాత్రమే పూర్తిగా నియంత్రించలేవని, ప్రజలందరూ సమష్టిగా కృషి చేయాలని అన్నారు. లఘుచిత్రాలు, జానపద కళారూపాలు, పాటలు, నాటకాల ద్వారా సామాజిక సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించవచ్చని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లోనే కాకుండా పర్యాటక ప్రాంతాల్లోనూ స్థానిక కళాకారులతో ప్రదర్శనలు నిర్వహిస్తే వారికి ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. కళాకారుల ప్రతిభను సమాజానికి ఉపయోగపడేలా వినియోగించుకోవడంతోపాటు, వారి జీవనోపాధికి తోడ్పడే కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు.

**700 మంది కళాకారులతో 30 కళారూపాల ప్రదర్శన.. తెలంగాణ జానపద వైభవాన్ని చాటిన కళాకారులు**

సద్దుల బతుకమ్మ వేడుకల్లో భాగంగా సుమారు 700 మంది కళాకారులు 30 రకాల కళారూపాలను ప్రదర్శించారు. తెలంగాణ గ్రామీణ జీవనశైలి, జానపద సంప్రదాయాలు, సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబించే ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. సంప్రదాయ నృత్యాలు, జానపద గేయాలు, కళాకారుల ప్రదర్శనలతో ట్యాంక్‌బండ్ పరిసరాలు సందడిగా మారాయి. సుమారు 700 బతుకమ్మలతో హుస్సేన్‌సాగర్ తీరంలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు, యువతులు, చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ ఆడుతూ, పాటలు పాడుతూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.





## నగరంలో సద్దుల బతుకమ్మ సందడి.. ఆడి పాడిన మహిళలు

- **వరంగల్ చెరువుల వద్ద బతుకమ్మ కోలాహలం**
- **సద్దుల బతుకమ్మతో ముగిసిన పండుగ**

**వరంగల్, బ్యూరో మహా ;** వరంగల్ నగరంలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. తొమ్మిది రోజుల బతుకమ్మ పండుగకు ముగింపుగా జరిగే సద్దుల బతుకమ్మ వేడుకలను ఆడపడుచులు అత్యంత ఉత్సాహంగా జరుపుకున్నారు. భద్రకాళి ఆలయం, చిన్న వడ్డేపల్లి చెరువు, తోట మైదానం, ఉర్సు చెరువు, పద్మాక్షమ్మ సరస్సు ల వద్ద మహిళలు బతుకమ్మ పాటలతో ఆడి పాడుతూ సందడి చేశారు. తెలంగాణ ఆడపడుచుల అతిపెద్ద పండుగ సద్దుల బతుకమ్మ వేడుకలు వరంగల్ నగరంలో అంబరాన్ని తాకాయి. తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుపుకున్న బతుకమ్మ పండుగ ఆదివారం సద్దుల బతుకమ్మతో ముగిసింది. ఉదయం నుండే మహిళలు తమ ఇళ్లలో గుమ్మడి, తంగేడు, బంతి, చామంతి పూలతో అందంగా బతుకమ్మలను పేర్చారు. సంప్రదాయ దుస్తుల్లో, పట్టు చీరల్లో ముస్తాబై బతుకమ్మలను తలపై పెట్టుకుని చెరువుల వద్దకు చేరుకున్నారు. చెరువు కట్టల వద్ద వేలాది మంది మహిళలు వలయంగా చేరి...

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో... సద్దుల బతుకమ్మ ఉయ్యాలో... సక్కని బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఆడి పాడారు. టీనేజీ అమ్మాయిలు కోలాటాలాడుతూ డీజే పాటలకు నృత్యాలు చేస్తూ బతుకమ్మల వద్ద సందడి చేశారు.చిన్న వడ్డేపల్లి చెరువు, తోట మైదానం, ఉర్సు చెరువుల వద్ద ఎక్కడ చూసినా పూల బతుకమ్మలతో, మహిళల కేరింతలతో పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారుల నుండి వృద్ధుల వరకు అందరూ ఈ వేడుకల్లో పాల్గొని ఆనందంగా గడిపారు.అనంతరం మహిళలు తమ బతుకమ్మలను చెరువు నీటిలో నిమజ్జనం చేసి, ఒకరికొకరు సద్దులు పంచుకుని, శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తొమ్మిది రోజులు బతుకమ్మను భక్తి శ్రద్ధలతో కొలిచి, తమ కుటుంబాలు సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కుకున్నారు.కాశీబుగ్గ 19 వ డివిజన్ లోని శ్రీ వెంకటేశ్వర కాలని లో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలని వెల్ఫేర్ అధ్యక్షులు ఎరుకల రఘునారెడ్డి నాగలత బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియచేస్తూ వేడుకలను ప్రారంభించారు. ఈ వేడుకల్లో మహిళలు, యువతులు, మహిళా నేతలు, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ వద్దిరాజ రవిచంద్ర

- **పూర్ణకుంభంలో స్వాగతం పలికిన ఆలయ అర్చకులు**

**మట్టెవాడ, మహా** : ఓరుగల్లు ప్రజల ఇలవేల్పు శ్రీ భద్రకాళి అమ్మవారి నవరాత్ర దసరా మహోత్సవాల సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు,రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆదివారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.కాకతీయుల కాలం నాటి చారిత్రక పుణ్య క్షేత్రమైన భద్రకాళి ఆలయంలో దసరా శరన్నవరాత్ర మహా త్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా దుర్గామాత అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన రవిచంద్ర కు ఆలయ కమిటీ సభ్యులు,అధికారులు,వేద పండితులు మేళ తాళాలు,పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం రవిచంద్ర తో పాటు దాస్యం వినయ్ భాస్కర్, నన్నపనేని నరేందర్ తదితరులు తమ గోత్ర నామాల తో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.పూజల అనంతరం వేద పండితులు వారికి అమ్మవారి శేష వస్త్రాలు కప్పి సత్కరించి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వచనాలు అందజేశారు.

**అమ్మవారికి తొమ్మిది రోజుల పాటు పూలంగి సేవలు**

వరంగల్ లోని చారిత్రక శ్రీ భద్రకాళి దేవస్థానంలో నిర్వహించనున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో అమ్మవారికి పూలంగి సేవలు నిర్వహించే భాగ్యం తమ కుటుంబానికి లభించడం అదృష్టంగా భావిస్తున్నామని రాజ్యసభ సభ్యులు, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం శ్రీ భద్రకాళి అమ్మవారికి, అమ్మవారి శేష వాహనాలకు వివిధ రకాల పుష్పాలు, గజమాలలతో పూలంగి సేవలు నిర్వహించినట్లు వెల్లడించారు. రంగురంగుల పుష్పాలతో అమ్మవారిని, వాహనాలను సర్వాంగసుందరంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ పవిత్రమైన సేవలో భాగస్వాములయ్యే అవకాశం తమ కుటుంబానికి దక్కడం పూర్వజన్మ సుకృతం అని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు.







## మనిషిని గీయాలి

భావం తట్టిలేపే చిత్రాలు
జీవం ఉట్టిపడే చిత్రాలు ఎన్నో
ఆదరణ తరగని
బ్లాక్ అండ్ వైట్ ఫొటోస్
కాలం అగాధంలోకి జారని
ఈస్టమన్ ఆల్బమ్స్ ఎన్నెన్నో
కళాభాస్కరులకి
పురస్కారాలు సత్కారాలు
ఒక సేవాసంస్థ ఇస్తూ
ఆకలి ఆకారాన్ని చిత్రరూపం
ఇచ్చే ప్రయత్నమేది
జరగనేలేదు
కన్నీటివర్ణంతో గీసిన బొమ్మలేవి
కనబడనేలేదు
చూపరులు
ముగ్గులు కాదు దగ్గులు కావాలి
దైవత్వాన్ని ప్రకృతిని కాదు మనిషిని
గీయాలి

**కోటం చంద్రశేఖర్**
**9492043348**

# మట్టి దుబ్బల్ల మొలిచిన అఆలు, గుణింతాలు

మల్లెలు చేమంతులూ బంతులూ గులాబీలూ వేరు. అవి అంగళ్లలో మెరుస్తాయి. అలంకారాలవుతాయి. గుడిలో పెద్ద దేవుళ్లకు మాలలవుతాయి. గునుగుపూలు అట్లా కాదు. అవి గడ్డిపూలు. ఏ నీరూ ఏ ఎరువూ అక్కరలేని గాలిపూలు. చూడచక్కగా ఉంటాయి, సుతిమెత్తగా తగులుతాయి, ఎప్పుడూ వాడిపోనట్టే ఉంటాయి. అయినా, వాటికి శిష్టుల కావ్యాల్లో చోటు ఉండదు. ఆలయాల్లో అలంకరణ జరగదు.

కొన్ని జీవనసౌందర్యాలు కూడా అంతే. అణగారిన చరిత్రలలో అనామకంగా మిగిలిపోతాయి. కొన్ని వీరగాథలు కూడా అంతే. పల్లకీలు పరాక్రమాలకు బోయీలవుతాయి. అధికారిక కథనాల కోలాహలంలో మూగబోతాయి. మట్టిమనుషులు కదంతొక్కినప్పుడు, కళ్లు విప్పినప్పుడు, గొంతు పెకిలించుకున్నప్పుడు, చరిత్ర తలకిందులైనప్పుడు, గునుగుపూలే తురాయిలవుతాయి. పక్కలకు మూలలకు నెట్టుకుపోయిన బతుకులే రాచవీధులను కమ్ముకుంటాయి. బతుకుకతల, వెతల ఇతిహాసాలు ఆవిష్కారం అవుతాయి.

తనది 'సన్న సినుకసొంటి బతుకు' అని జూపాక సుభద్ర అన్నారు. సుభద్ర లాంటి వారి జీవితం ఎండరాళ్ల మీద ఆవిరయ్యే తుంపర చినుకు కాదు. అనేక దుర్భిక్షాలను కత్తిలా చీల్చే చినుకు. అనేక చెలిమెలను చల్లగా నింపిన చినుకు. ప్రవాహమై పరవళ్లు తొక్కిన చినుకు. బతకమ్మలో ఒదిగి, వెలిగిన గునుగుపూల చినుకు.

'ఆంధ్రజ్యోతి' ఆదివారంలో ఏడాదిపాటు సాగిన అపురూపమైన కాలమ్ 'గునుగుపూలు'. అది ఒక దళిత, మాదిగ స్త్రీ బాల్యాన్ని, కుటుంబ విశేషాలను, జీవనపోరాటాన్ని, విజయాలను చెప్పిన జ్ఞాపకాల కాలమ్ మాత్రమే కాదు. అది మాత్రమే అయితే, ఇది ప్రధానస్రవంతి తెలుగు సాహిత్యంలోను, రచనా ప్రపంచంలోను చోటు దొరకని సామాజిక పార్శ్వాలను వర్ణించిన అరుదైన రచన మాత్రమే అయి ఉండేది. కానీ, ఇది ప్రాతినిధ్యం వల్లనో, ఆధిపత్యఅక్షరప్రపంచంలో అంగుళం స్థలం సంపాదించుకున్నందువల్లనో మేలి రచన కాలేదు. జీవనపరీమళంతో సాహిత్య ఉద్యానవనాన్ని ఆవిరించినందుకు, సాధ్యమైనంతగా ఖాళీలను సృజనాత్మకంగా భర్తీ చేసినందుకు, కొత్త సున్నితత్వాలను అలవరించినందుకు, పాక్షికమైన భావుకతలను, బెంగలను, ఆదర్శ ఆవేశాలను గీటురాయి మీద నిలబెట్టినందుకు, 'గునుగుపూలు' గొప్పదైంది. తెలుగు, తెలంగాణ సమాజాల సామాజిక, సాంస్కృతిక చరిత్రకు ఒక అనుభవాత్మక విస్మృత పార్శ్వాన్నిజోడించినందుకు ఇది విలువైనది అయింది.

మరొకరి జీవితాన్నిచదివినప్పుడు, మనకు తెలియకుండానే ఒక బేరీజు జరుగుతుంది. మనం పోల్చుకునేవి, మనవే, మనలాంటివే అనుకునే అనుభవాలుంటాయి. మనం ఆగిపోయిన అడుగులు ఉంటాయి, తప్పొప్పుల చర్చలుంటాయి. చివరకు మరొక జీవితాన్ని పాక్షికంగా అనుభవించిన సంతృప్తి ఉంటుంది. కాల్పనిక సాహిత్యం కానీ, ఆత్మకథనాత్మక రచనలు కానీ, మనుషుల్లో సంఘీభావాన్ని, సానుభూతులను, విలువల విచిక్షతను, ఎంపికల మథనను కలిగించగలుగుతాయి. సాహిత్యం నిర్వర్తించగలిగే కర్తవ్యాలలో ఇది ముఖ్యమైనది. ఈ కాలమ్ ద్వారా సుభద్ర, సన్నటి దారుల నుంచి ఎంతో ఘర్షణ పడి సాగిన ప్రయాణాన్ని పాఠకులతో పంచుకున్నారు. ఇటువంటి జీవితమే గడిపిన వారికి ఏకీభావం, ఇతరులందరికీ సహానుభవాన్ని అందించారు. చాలా మంది జ్ఞాపకరచయితల వలె, ఆత్మకథకుల వలె, తన ప్రస్తుత ప్రసిద్ధత్వంనుంచి మాట్లాడకపోవడం సుభద్రలోని మరో సుగుణం. ఆమె తన ప్రయాణాన్ని మాత్రమే, ఒక అట్టడుగు సామాజికత్వం నుంచి, మారుమూల గ్రామీణత్వం నుంచి చదువులోకి, అధికారస్థానాలలోకి ఎదగిన తీరును, అవకాశాలను అందుకోవడంలోని ఆనందం నుంచి, అసమానతలను ప్రశ్నించే ధిక్కారం దాకా, జీవిత గమనాన్ని ఆమె ఈ కాలమ్‌లో చిత్రించారు. ఆమె రచనలోని గుణాన్ని 'వినయం' అని చెబితే సబబు కాదేమో కానీ, జీవితం తనకు తెరిచిన కొత్త తలుపులకు ఆమె చూపే కృతజ్ఞతకు, తాను పడిన ఘర్షణల నుంచి విస్తరించుకున్న చూపు మీద పెంచుకున్న ప్రేమకు, వ్యవస్థల మీద విమర్శతో పాటు, వ్యక్తుల విషయంలో చూపే సౌహార్ద్రతకు సరిగ్గా సరిపోయే మాట దొరకడం కష్టం.

అంటరాని కులం, అయినా అంతో ఇంతో భూవసతి కలిగిన కుటుంబం. సాంస్కృతిక అంశాలు గాఢంగా అలుముకున్న జీవన విధానం. ఉత్తర తెలంగాణలోని మారుమూల గ్రామం దామరంచపల్లె నుంచి బెల్లంపల్లి బొగ్గుగనుల కార్మికవాడలోకి పడిన తొలి అడుగు, వరంగల్ విద్యార్థి జీవితం నుంచి విచ్చుకున్న ఉద్యమ స్వభావం, పాలనాయంత్రాంగం గర్భగుడిలోకి దరిచేర్చిన చదువుల ప్రతిభ, వర్గపోరాట ఉద్యమాల నుంచి సామాజిక న్యాయ రాజకీయాలలోకి పరివర్తన, ప్రతి అడుగులోనూ ప్రతి గమ్యంలోనూ సామూహికత ను వీడని ప్రయాణం ఇదీ సుభద్ర. గుదిగుచ్చిన గునుగుపూలలోని అంతస్సూత్రం ఈ భౌతిక ప్రయాణమయితే, తనను తాను మననం చేసుకుంటూ సింహావలోకనం చేసుకున్న జీవిత సౌందర్యం సుభద్ర చేసిన ఉద్వేగ ప్రయాణం.

గంజిలో మెతుకు అపురూపమైన జీవితం సుభద్రది. "...యెంత బూములున్నా, పుట్లకొద్ది వడ్లు బండిచ్చినా పొద్దటిపూట జొన్నగడక తినవల్సిందే. రాత్తిరికే బువ్వ.. గంజిల వుప్పేసుకుని వూదుకుంట తాగుతుంటే మద్దెల మద్దలె బువ్వ పలుకులు తాకుతే.. మిన్నును తన్నిన ఆనందముండేది....పొద్దుగాల గడ్క సరింగ దినక యెప్పుడు సీకటి వద్దదా, యెప్పుడు యెండబోతదా అని పోపో




సూరుడా పొద్దుబాయె సూరుడా అని యెల్లగొట్టే పాటలు పాడేది.'' పెండరొచ్చుల్లోనే అక్షరాలు దిద్దుకున్నది ఆమె. "మా బడి పగలు పాఠశాల, రాత్రి గొడ్లకొట్టంగా ఉండేది. మా చెప్రాసి లింగన్న ఏడింటికే వచ్చి గొడ్లనెల్లగొట్టి వాటి పెండరొచ్చంత ఎత్తిపోసేది. దొడ్లు దొక్కి గచ్చంత పొక్కిలే పాడయేది. .. బట్టలన్ని రొచ్చు వాసనొచ్చేటియి ఇంటికి బోయెటాలకు.'' అయినా సరే, ఆ తడ్కల బడి సుభద్రకు 'తల్లోలె యాదికనే ఉంటది'.

మొదటిసారి చెప్పులు తొడుక్కున్న అనుభవం కూడా సుభద్ర ఎంతో మురిపెంగా చెబుతారు. గ్రామాలలో పీడితకులాల వారికి తలకు, కాళ్లకు ఆచ్ఛాదనలు నిషిద్ధం కావడం ఒక అంచె అయితే, అందులో ఒక అడుగు ముందుకు వేసిన తరువాత కూడా ఆడపిల్లలకు చెప్పులకు అంత తొందరగా అందుబాటులో రాలేదు. బెల్లంపల్లికి వచ్చిన తరువాత చెప్పులు తొడిగిన బాలసుభద్రకు, ఆ అనుభవం ఒక అపురూపం. అనేక అందలాలు ఎక్కిన తరువాత కూడా గుర్తుండిపోయే తొలి విజయం.

రచయిత సామాజిక నేపథ్యంలోని, బాల్య అనుభవాలలోని కఠినత్వం, ఇతర శ్రేణులకు చెందిన పాఠకులకు దయనీయంగాను, బాధాకరంగానూ అనిపించవచ్చు. రచయిత కూడా దాన్ని నిరాకరించరు. కానీ, సామాజిక వివక్ష, పేదరికాలతో ముడిపడిన ఆ అనుభవాలలో కూడా తాము పొందిన ఆనందాలను ఆమె పంచుకుంటారు. తాను మెలిగిన పరిసరాలలో లభించిన స్నేహాలను, ఆత్మీయతను, సహకారాన్ని కూడా కృతజ్ఞతతో గుర్తుచేసుకుంటారు. జీవితాన్ని నిర్వహించేటప్పుడు, దుర్భర పరిస్థితులలో కూడా మనుషులు కొత్త తోవలు, ప్రేమలు, చిరు సంతోషాలు వెదుక్కుంటారు. తమ ఉనికిని మెరుగుపరచుకోవడానికి, మొత్తంగా లోకాన్ని మెరుగుపరచడానికి సంకల్పపూర్వకంగా ప్రయత్నాలు చేస్తారు. సుభద్ర తన జ్ఞాపకాలను, వాటిలోని వేదనతోను, సౌందర్యంతోనూ కూడా కలుపుకుని పాఠకులతో పంచుకున్నారు.

'గునుగుపూలు' లోని గొప్ప లక్షణాలలో అది ఒకటి. పెద్దబాలశిక్షతో రచయిత జ్ఞాపకం అపురూపమైనది. తనకు చూపించదలచిన ప్రపంచాన్ని దాటి బాల్యపు కన్ను మరింత లోతుకో దూరానికో పూర్తిగా మరో కోణానికో ప్రసరిస్తుంది. బాలశిక్షలోని అక్షరాలు సరే, దాని అట్టమీది బొమ్మలోని ఒక అందం సుభద్రను ఆకట్టుకుంది. ఆ అట్టమీద తనంతనే ఉన్న 'పిల్ల ఆకుపచ్చ రంగున్న తెల్లపువ్వులతో వున్న బుగ్గల గౌను యేసుకున్న బొమ్మ' ను 'యిరాము లేకుంట సూసేది. ఆ పిల్ల కండ్లల్ల మైెండుల ముద్దరేసినట్లే' ఆమెకు యాదున్నది. అందరికీ కలిగే అనుభవం లాగా కనిపిస్తుంది కానీ, ఆ చూపులో ఒక నిర్దిష్టత, ప్రత్యేకత కూడా ఉన్నాయి.

రచయిత తన 'అవ్వ' గురించి చేసిన వర్ణనలు చూస్తే వాటిలోని సూక్ష్మ వర్ణనలు, అంతర్లీనంగా సూచించిన సామాజిక సంక్లిష్టతలు ఎంతో అబ్బురంగా కనిపిస్తాయి. మానవసామాజిక సాంస్కృతిక చరిత్రలు ఇటువంటి వివరాలతోనే సంపన్నం అవుతాయి. నిండా సొమ్ములు వేసుకుని వాళ్లమ్మ నడుస్తుంటే డప్పుసప్పుడోలె ఉండేదట!

"....మెడల గుండ్లు, ఆ గుండ్ల నడుమ వొక్క గంటె పుస్తె పట్టెడ, దండ సేతులకు బంగారి కడాలు, సేతులకు మందటి కడాలు,యెనుక పెండీలు యెండియే వుండేయి. ఈటి నడుమ గాజులుండేయి మట్టియి. సవురం బెట్టి యేలి సిగేసుకొని అది వూడకుంట బంగారి సిగపువ్వుబెట్టుకుని, నడుము యెండి గజ్జెల ఒడ్డానం.....కుడి కొంగేసుకుని, మట్టెలల్ల మర్రిగుత్తులు గాకుంట, బండిదారులు కంచుమట్టెలు బెట్టుకొని నడుస్తాంటే భూమిదన్నదన్న బోయేటి డప్పు సప్పుడోలె ఉండేది.

భూములుండెపటికె గానీ మాదిగె దానికేమి సిరి. భూమిచ్చిన దన్ను, భూమిచ్చిన సిరి దీనికి.."

అన్ని భూములున్న సిరి కూడా, క్షురకులు ఇంటికి వచ్చి పనిచేయడానికి అనుమతించదు. అదే సమయంలో, ఆ అంటరాని తనం 'సూదరోళ్లు' తన తల్లి చీరెలు అరువు తీసుకోవడానికి అడ్డుపడదు. " 'అవ్వా.. ఆల్లు మనలను ముట్టుకోకున్నా నీ సీరెరైకెలు వాళ్ల పెయిని సుట్టుకుంటున్నయి తియ్' అని సుభద్ర అక్క వాళ్లమ్మతో అనేదట. నిచ్చెనమెట్లతో కలగలసిన సామాజిక సహజీవనంలో, మనుషులు తమను తాము ఎట్లా సముదాయించుకునేవారో, ఎట్లా ఇతరులతో పరిమితమైన కలివిడిని కొనసాగించగలిగేవారో, సుభద్ర కథనంలో మనకు అనేక సూచనలు దొరుకుతాయి. షరతులతో నిండిన ఈ సమష్టి జీవితంలో సాధ్యమైనంతగా సమత్వాన్ని సాధించడానికి చేసే ప్రయత్నాలు, పోరాటాలు కూడా సూక్ష్మస్థాయిలో అర్థం అవుతాయి.

తను పుట్టిపెరిగిన కుటుంబం, సంస్కృతి, భాష, వాటికి తక్కిన ప్రపంచపు చదువులకు, వ్యవహారాలకు ఉన్న దూరం, దగ్గరితనం అన్నిటిని ఎంతో నెమ్మదితనంతో, అదే సమయంలో పదునైన విమర్శతో చెప్పడం సుభద్ర రచనలో మరో విశేషం. ఏ దశలోని జీవితం మీదైనా ప్రేమను కోల్పోని చూపు, అసమానత ఎక్కడ కనిపించినా కలవరపడకుండా ఉండలేని సున్నితత్వం ఈ రచయితది.

కొంతవరకు బడులు, ఆ తరువాత కాలేజీలు, హాస్టళ్లు మెరుగైన సమాన ప్రతిపత్తిని అందిస్తే, ప్రజా ఉద్యమాలు అంతరాలు లేని పరిగణనను సుభద్రకు అందించాయి. ప్రతి మెట్టు మీదా తనకు అందిన మెరుగైన మానవీయమైన హోదాను రచయిత ఎంతో కృతజ్ఞతతో స్మరించుకుంటారు. ఒక్కొక్క మెట్టు ఎక్కిన కొద్దీ, సమానత్వ ఆకాంక్ష విస్తరిస్తుంది, వివక్షలు సూక్ష్మరూపంలో కూడా ప్రస్ఫుటమవుతాయి. న్యాయభావన మరింత పదునెక్కుతుంది. తనకోసమే కాదు, అసమానతలను అనుభవించే ప్రతి ఒక్కరి కోసం కూడా గౌరవాలను, అవకాశాలను విస్తరింపజేయాలన్న ఆకాంక్ష పెరుగుతుంది. విద్యార్థి ఉద్యమ జీవితం సుభద్రకు ప్రజాస్వామిక అనుభవాలనే కాదు, అన్ని అంచెలలో ఉండే వివక్షలను పరిచయం చేసింది. తనను గర్వపెట్టిన సచివాలయ ఉద్యోగం కూడా, తన పోరాటాలకు కొత్త వేదికలను ఇవ్వడంతో పాటు, ఉన్నత స్థలాలలో కూడా తిష్ఠ వేసుకున్న నిచ్చెనమెట్లను అనుభవంలోకి తెచ్చింది. మొత్తంగా ఈ ప్రయాణం అంతా తన దృక్పథాన్ని పదేపదే విమర్శకు గురిచేసుకుని, కొత్త రాజకీయ, సామాజిక అవగాహన పెంచుకోవడానికి ఉపయోగపడింది. ఆ రకంగా 'గునుగుపూలు' ఒక పోరాట కథనం కూడా అయింది.

రచనల ఎంపికలో, ప్రచురణలో సంపాదకుడిగా నా



**కె. శ్రీనివాస్**

అనుభవాలను నిర్దిష్టంగా ప్రస్తావించడం నాకు ఇష్టం ఉండదు కానీ, సుభద్ర 'గునుగుపూలు' సందర్భాన్ని మాత్రం చెప్పితీరాలి. నేనప్పుడు 'ఆంధ్రజ్యోతి'లో పనిచేస్తున్నాను. ఈ రకమైన కాలమ్ రాస్తానని రచయిత చెప్పినప్పుడు, నాలో కొంత ఊగిసలాట ఉండింది. అందుకు కారణం ఆమె కానీ, ఆమె రచన నాణ్యత కానీ కాదు. నా అభిరుచిలోపం కూడా కారణం కాదు. తెలంగాణ ఉద్యమకాలంలో వరంగల్లులో ఒకసారి సుభద్ర ఉపన్యాసం విని ఆమె అభిమానిగా మారిపోయాను. ఆమె కవితలు, కథలు చాలా ప్రచురిస్తూ ఉన్నాము కూడా. ఆమె కూడా తాను ఏది రాసినా, ఆంధ్రజ్యోతిలో ప్రచురించడానికే ఇష్టపడేవారు. పత్రిక కూడా ఆమె ప్రతి రచనకి ప్రాధాన్యం ఇచ్చి ప్రచురించేది. కథలూ కవితలూ సరే కానీ, సామాజిక న్యాయభావనతో అస్తిత్వ ఆత్మగౌరవంతో సంచలిస్తూ పోయే ఒక రచయిత పర్సనల్ కాలమ్‌ను , ప్రాంతీయ, సామాజిక మాండలికంలో చిక్కటి సాంస్కృతిక శైలిలో చేసిన రచనను, మధ్యతరగతి ఉల్లాసపఠనానికి ఉద్దేశించిన మేగజైన్ లో ప్రచురించడం ఎంత వరకు 'చెల్లుబాటు' అవుతుందోనన్న సందేహం కలిగింది. ఆ ప్రశ్నమీడియా పరిమితికి, నా వ్యక్తిగత పరిమితికి సంబంధించింది మాత్రమే.

సమాజంలో ఆలోచనలకు, అభిప్రాయాలకు తానే గేట్ కీపర్ ని అన్న అతిశయంలో ప్రధాన మీడియా ఉంటుంది. ఆ ప్రతిపత్తిని నిరోధాలకే తప్ప కొత్తగాలుల ప్రవేశానికి ఉపయోగించే సంకల్పం, అవకాశం ఆ మీడియాకు ఉండదు. పైగా, రచయితలకు, రచనలకు తాము అవకాశం ఇస్తున్నామన్న ఆధిక్యభావం పత్రికల్లో, సంపాదకుల్లో ఉంటుంది. మంచి రచనలు తమ పత్రికలకు ప్రచురణకు ఇచ్చి, తద్వారా రచయితలే పత్రికలకు మేలు చేస్తున్నారన్న గుర్తింపు ఉండదు. తమను తాము ఉదారవాదులం అనుకుని, దారులను వెడల్పు చేద్దాం అని ప్రయత్నించేవాళ్లకు కూడా వ్యవస్థాగత అవరోధాలతో పాటు, తమకే తెలియని అనేక సొంత జ్ఞాన, అవగాహనా పరిమితులు ఉంటాయి. ఎన్ని కొత్త చేర్పులు చేసుకున్నా, మినహాయింపులు మిగిలే ఉంటాయి. అన్ని రకాల రచనలకు పాఠకులకు అందించే బాధ్యత కంటె, వ్యాపార సూత్రాలను పాటిస్తున్నామా లేదా అన్న కెరీరిస్టు ప్రాతిపదికలు పైచేయి అవుతుంటాయి. యాజమాన్య విధానాలను తెలుసుకుని జాగ్రత్తగా మెలిగే చాకచక్యం నేర్చుకున్నంతగా, ప్రజా ప్రయోజనాల నుంచి ప్రాధాన్యాలేమిటో తెలుసుకోవాలన్న పట్టింపు ఉండదు. అటువంటప్పుడు, రచయితలకైనా, పాత్రికేయులకైనా సున్నితత్వాలను సమాజమే అలవరచాలి. విన్నప్పుడు మిత్రసమ్మితంగా, లేకుంటే, ఉద్యమసమ్మితంగా. ఈ విషయంలో సుభద్రతో చేసిన సంభాషణల్లో, నా సంకోచాల వెనుక ఉన్న దృక్పథపరిమితులు, ఆచరణ పరిమితులు నాకు బోధపడ్డాయి. మా సంపాదక బృందానికి కర్తవ్యం తెలిసింది. అందుకు ఆమెకు కృతజ్ఞత చెప్పాలి.

'గునుగుపూలు' రావడం మొదలయ్యాక, ఒక విషయం మళ్లీ కొత్తగా తెలిసివచ్చింది. సమాజం చాలా కొత్తను, విభిన్నతను, వైవిధ్యాన్ని తీసుకోవడానికి ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది. కాపలాదారులకే వెనుకబాటుతనం ఉంటుంది. ఇంతకాలంగా పత్రికలలో వస్తున్న, వచ్చిన స్త్రీ, పురుష రచయితల ఆత్మకథనాత్మక కాలమ్స్ శ్రేణిలో సుభద్ర కాలమ్ కూడా తనదైన విశిష్టతతో, ప్రత్యేకతతో ఒదిగిపోయింది. అంతేకాదు, ఇటువంటి అనేకం, వివిధ నేపథ్యాల నుంచి సంస్కృతుల నుంచి రచనలు వచ్చి ప్రధానవేదికలను సంపన్నం చేయాలని మరింత బలంగా అనిపించింది. ఆమె నడిచివచ్చిన జీవితం, దాని వ్యక్తీకరణ రెండూ కలిసి పాఠక సంవేదనలను విశాలం చేశాయి. గునుగుపూలను సగర్వంగా ఊరేగించాయి. •

# తెలంగాణ అస్తిత్వానికి ఊపిరి అంబటి వెంకన్న "వెన్నెల పదాలు"

ఒకనాడు ఒట్టి పోయిన తెలంగాణలో మట్టి పదాల బర్కతితో బతుకమ్మను
ఎత్తి ఇక్కడి సంస్కృతిని ఓలలాడించిన బలమైన సాంస్కృతిక బాటసారి,
బతుకు పాటల బైరాగి, నెనరు గల్ల మనిషి, బరువువైన భావాల రహదారి అంబటెంకన్న.

తెలంగాణ అస్థిత్వ
పదాలకు ఊపిరి పోస్తూ తేట తెంగాణ యాసతో
పాటలకు రూపమిస్తూ
గౌరమ్మ పాటల గౌరవాన్ని
తెలంగాణ సాంస్కృతిక
జీవన రవళిని వినిపించిన జానపదాల గునుగు వనం,
తంగేడు పూలదళం అంబటి ఎంకన్న.

నాటి తెలంగాణ ఉద్యమంలో ఉద్యమానికి ఎన్ను దన్నుగా నిలవడి, పోరుబాటలో తనవంతు పాత్రను పోషించిన ఉద్యమకారుడు. ఆయన రాసిన బతుకమ్మ పాటలు తెలంగాణకు మేటిగా సాంస్కృతిక వారసత్వంను
తెలియజేసినవి.

రికాంలేని నెనరు
పలుకుల సంచారిగా
రెక్కలు కట్టుకున్న
మనసు ములుకులవిహారిగా
చిన్నప్పుడు వెన్నెల్లో ఆడుకున్న పల్లె జ్ఞాపకాల
వెల్లువను కరువు మబ్బుల్లో చందమామ పరుగులిడుతున్నట్లుగా
బతుకమ్మ పాటలను
మోట భావి ఊటలైన
పల్లెకాడు, పాటల విలుకాడు అంబటెంకన్న
వాన దేవునికి గంగమ్మతల్లి
సుద్దులు చెప్పేటప్పుడు వలలో అనే కోరస్ ను
పాట మొత్తం కొనసాగిస్తూ




పల్లెను ప్రకృతిని చిత్రికపట్టి
ఓ విభిన్నమైన అనుభూతిని
పొందేలా పాటను చక్కగా నడిపించటం లో సఫలీకృతుడు అయ్యాడు.

పాటంతా అందమైన ప్రాసలతో అత్యంత మధురమైన తెలంగాణ
యాసను పనిముట్టుగా వాడిన, పాడిన విధానం గొప్పగా ఉన్నది.

అంబటెంకన్నకు
కరువుల బుట్టిన
అచ్చరాలు అరణం గావొచ్చు,
ఏ పాట తీసుకున్నా అక్కడ ఆకలిని ఆర్తిని, మనిషి వాసనల మూర్తిని విశేషంగా
చెప్పే ప్రయత్నం చేస్తూనే ఉంటాడు.

బ్రతుకు ప్రశ్నగా మిగిలిన బహుజన ఉద్యమంలోను
పొగిలి పొగిలి దుఃఖమైతున్న ఫ్లోరైడ్ పీడీత వ్యధలోనూ
కల్లు పాటను కైగట్టి దాని అవశ్యకతను అవసరతను
తెలియజేసిన పాటలగంప
మన అంబటి వెంకన్న.

నల్లగొండ నడిబొడ్డులో తెలంగాణ కొరకు పోరుజెండను బట్టి,
పాటతో గళమెత్తి
ఎన్నో వేదికల మీద
మాటల తూటాలై పేలిన
మంచి వక్త అంబటి వెంకన్న. శ్రోతలను కట్టిపడేయ గల తన వాగ్ధాటితో ఎన్నో ధూంధాంలను అద్భుతంగా నడిపించిండు.
తెలుగు సాహిత్యంలోనూ, తెలంగాణ ప్రత్యక్ష ఉద్యమంలోనూ క్రియాశీలకంగా పని చేసిన అంబటి వెంకన్నకు దక్కాల్సిన గౌరవాలు,
రావాల్సిన సత్కారాలు,
గుర్తించాల్సిన మనసులు
ఇంకా దక్కలేదనే చెప్పాలి.

ఇలా ఎందరో కవులు కళాకారులు తెలంగాణ ఉద్యమానికి, ప్రజలను జాగృత పరిచే పాటకు ఆటకు సేవలందించి
గుర్తింపుకు మిగిలిపోయిన ఆనవాళ్లుగా ఉన్నారు.

నేడు వెంకన్న తన బతుకమ్మ పాటలను "వెన్నెల పదాలు" అనే పుస్తకంగా
తెస్తున్న మంచి ప్రయత్నంలో
వారికి శుభాకాంక్షలు...

**జానయ్య గంధం**

## స్మృతుల దివిటీ

కాలగర్భంలో కలిసిన క్షణాలు
మనోగర్భంలో మిగిలిన
అనుభూతుల వలయాలు
మాసిన దృశ్యాలు.. మిగిలిన ముద్రలు
చెదిరిన బంధాలు.. చెరగని గురుతులు

నవ్వుల వెనుక నాటి వెచ్చదనం
కన్నీటి వెనుక వీడని ఆర్ద్రత
కొన్ని మాటలు.. మౌనపు ప్రతిధ్వనులు
కొన్ని చూపులు.. జీవితకాలపు సొపతులు

బాల్యపు బడిబాటలో బాసటైన మైత్రి
యవ్వనపు మలుపుల్లో ఎదురైన దృశ్యాలు
అన్నీ మనల్ని నీడలా నడుపుతుంటాయి
అమ్మ ఆప్యాయతలోని అమృతత్వం
నాన్న శ్రమలోని నిశ్శబ్ద తాత్వికత
విజయపు శిఖరంపై అది తొలి మురిపెం
ఓటమి అంచున ఆత్మావలోకనం

విడిపోవడంలోనూ మిగిలే ఆత్మీయత
మరపులోనూ చెదరని అనుబంధం
చాలా...అంటే చాలా గొప్పవి సుమా..
తిరిగిరాని కాలంపై తీరని ఆవేదన
మనల్ని తరచూ గుచ్చుతుంది
తిరిగి చూసుకున్నప్పుడు అవే జీవిత సత్యాలు

కొన్ని స్మృతులు గుండె గాయాల గాథలు
మరికొన్ని నిలువెల్లా నింపే ధైర్యపు ఊతాలు
నువ్వు అవునన్నా కాదన్నా...
ఒంటరితనపు అంచున ఓదార్పు
ఏ ఆస్తులతో కొలవలేని గొప్ప సంపద

గతం ముగిసిన అధ్యాయం కాదు
వర్తమానపు అంతరార్థం అది
ప్రతి అనుభవం వెనుక ఒక పాఠం
ప్రతి జ్ఞాపకం వెనుక ఒక జీవన తాత్పర్యం
మనకు నేర్పకనే నేర్పించి పోతాయి

వయసు పెరిగే కొద్దీ విస్తరించే జ్ఞాపకాల ప్రపంచం
కాలం కరిగే కొద్దీ స్పష్టమయ్యే బంధాల విలువ
ధనార్జన లెక్కల్లో చిక్కని సంతృప్తి
మన విజయాల్లో ఒదగని మమతల జెండా
అన్నీ తెలుసుకునే లోపు ఓ ముగింపు వాక్యం

ఏదేమైనా...
స్మృతుల దివిటీలో గతమే జ్వాల
అనుభవమే వెలుగు.. ఆత్మే సాక్షి...!

**డా.కటుకోఝ్వల రమేష్**
**సెల్:9949083327**

## సంకీర్ణ

ఆ దారిలో వెళుతూ కవి..,
ఎదురుచూస్తున్న పాఠకుని
ముఖంపై ఒక గీత గీసి పోయాడు.

అయోమయంగా నిలుచున్న పాఠకుని చేతిలో..,
అదే దారిలో వెళుతున్న విమర్శకుడు
ఆ గీతను మించిన
గీతను
అరచేతిలో గీసిపోయాడు.

ఇది నిత్యకృత్యమై పోయి
పాఠకుని ముఖమూ చేతులూ గీతలతో నిండి పోయాయి.
ఇదిట్లా కాదని
కవి..,
పాఠకుని వీపుపై
చిక్కుచిక్కుగా ఒకే గీతను గీసేసి పోయాడు.

అప్పటినుంచి
విమర్శకుడు
అంతకు మించిన గీతను గీద్దామని
ఆగీత కొలతలు
వేస్తూనే ఉన్నాడు.

**మడిపల్లి రాజ్‌కుమార్**
**99 49 699 215**

## కవిత్వం ఒక సాక్ష్యం



చీకటి అంచున ఎవరో
వెలుగును దాచిపెట్టారు.

నీడకు కూడా తెలియని
ఒక అడుగు అక్కడే మిగిలిపోయింది.

నిశ్శబ్దం తనలో తాను
ఏదో గొణుక్కుంటుంది విసుగ్గా.

రాత్రి చెదిరిన అద్దంలో
ఎవరి ముఖమో మెరిసింది.

ఆ జాడలను గమనిస్తూ
కవిత్వం అక్కడే నిలిచింది.



**కవి యాకూబ్**
**9849156588**

ANN తెలుగు
మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్
19-10-2026

మహా ప్రత్యేకం



# తీరొక్కపూలతో బతుకమ్మల అలంకరణ

**హైదరాబాద్ లో పాల్గొన్న రష్మిక.. కరీంనగర్ లో పాల్గొన్న పీవీ సింధు**
**రాష్ట్రవ్యాప్తంగా వైభవంగా వేడుకలు**
**హుస్నాబాద్ లో సంబురాల్లో పాల్గొన్న మంత్రి పొన్నం**
**సిద్దిపేటలో హరీష్ రావు, సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు**
**ఖైరతాబాద్ లో మహిళలకు శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ ఇన్ ఛార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి**

(మహా నెట్ వర్క్ )
తెలంగాణలో అత్యంత వైభవంగా జరిగే బతుకమ్మ వేడుకలు ఆదివారంతో ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు తీరొక్క పువ్వులతో బతుకమ్మను పేర్చి ఆడి పాడిన సంబురాలకు తెరపడింది. ఆదివారం జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకలతో రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో మహిళలు, ఆడపడుచులు వేడుకల్లో పాల్గొన్నారు. గునుగు, తంగేడు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయబద్ధంగా పాటలు పాడుతూ ఆడిపాడారు. చెరువులు, కుంటలు, ప్రధాన కూడళ్ల వద్ద మహిళలు సంబురాలు నిర్వహించారు. బతుకమ్మతో తెలంగాణలోని ప్రతి గ్రామం కళకళలాడింది. ప్రముఖ నటి రష్మిక తెలంగాణ కోడలిగా తొలి బతుకమ్మ జరుపుకోగా, హైదరాబాద్ లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక కరీంనగర్ కోడలిగా తొలి బతుకమ్మను పీవీ సింధు కరీంనగర్ లో జరుపుకున్నారు. సిద్దిపేటలో హరీష్ రావు ఆధ్వర్యంలో వేడుకలు జరగ్గా, సంగారెడ్డి లో జగ్గారెడ్డి దంపతులు బతుకమ్మ వేడుకల్లో సందడి చేశారు. ఆదిలాబాద్ లో కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ లు బతుకమ్మలు ఆడారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నేత మన్నె గోవర్ధన్ రెడ్డి బతుకమ్మ ఆడుతున్న మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. హుస్నాబాద్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి శుబాకాంక్షలు తెలపగా, హైదరాబాద్ లో మంత్రులు జూపల్లి, సీతక్కలు వేడుకల్లో పాల్గొన్నారు. ముషీరాబాద్ లో బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఆధ్వర్యంలో కార్యక్రమం ఘనంగా జరిగింది.





























## ఈనెల 22 నుండి పత్తి కొనుగోళ్ళు ప్రారంభం

**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో సీసీఐ, ప్రైవేట్ ఆధ్వర్యంలో అక్టోబర్ 22 నుండి పత్తి కొనుగోళ్లు ప్రారంభమవుతాయని మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. పత్తి కొనుగోళ్లలో తేమ శాతం నిర్ధారణపై ఏఎంసీ, సీసీఐ , ఐకేపీ , వీఓఏ సిబ్బందికి మార్కెట్ కార్యాలయంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. రైతన్నలకు మార్కెట్‌లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రైతులు తాము సాగు చేసిన పత్తిని మార్కెట్‌కు తెచ్చే ముందే తేమ శాతంపై సరైన అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన పత్తిని తీసుకువచ్చి మద్దతు ధరను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎమ్ ఓ గజానంద్, సెలెక్షన్ గ్రేడ్ అధికారి విట్టల్, రైతు నాయకులు గోవర్ధన్ యాదవ్, కొలారి పోశెట్టి, లక్ష్మణ్, దత్తార్థి, రమేష్, సీసీఐ బ్రాంచ్ మేనేజర్, ఐకేపీ వీఓఏలు, సీసీఐ ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ పూజ, , నరేష్, గణేష్ రైతు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఉదారి కి కాళోజి పురస్కారం

- **నిర్మల్ తెరవే సభ్యుల శుభాకాంక్షలు**
- **ఉమ్మడి జిల్లాకే గర్వకారణమని వెల్లడి**

**నిర్మల్ మహా:** తెలంగాణ స్వప్నికుడు, తెలంగాణ యాస సాహితీ శిఖరం ప్రముఖ కవి కాళోజి నారాయణ రావు పురస్కారం ప్రముఖ కవి రచయిత పరిశోధకుడు ఉదారి నారాయణ కు వరించడం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకే గౌరవమని తెలంగాణ రచయితల వేదిక నిర్మల్ జిల్లా సభ్యులు కొనియాడారు. గత నాలుగు దశబ్దాలుగా నారాయణ అనేక సాహితీ సేవలును చేస్తున్నారని తెలిపారు. తన రచనల ద్వారా తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను జీవన విధానలను, ప్రకృతి సోయగాలను, అడవి తల్లి కన్నీళ్లను ప్రపంచానికి భావవ్యక్తం చేస్తున్నారని కొనియాడారు. ఐతారం ముచ్చట్ల ద్వారా కవిత్వానికి కొత్త మెరుగులు అద్దుతున్నారన్నారు.కొత్త రచయితలను ప్రోత్సహిస్తూ, చక్కని వేదికలను కల్పిస్తున్నారని తెలిపారు. గత 26 ఏళ్లుగా తన తండ్రి తాత్వ కవి ఉదారి నాగదాసు పేరున రాష్ట్ర ఉత్తమ కవులను గుర్తించి పురస్కారం అందిస్తున్నారని తెలిపారు. అలాంటి కవికి కాళోజి పురస్కారం జిల్లాకు ఓ అలంకారమని తెర వే నిర్మల్ జిల్లా అధ్యక్షులు నేరెళ్ల హన్మంతు,సభ్యులు పత్తి శివప్రసాద్, పోలీస్ భీమేష్, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



## దసరా వేడుకల కరపత్రాలు అవిష్కరించిన కలెక్టర్

**ఆదిలాబాద్ మహా:** సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే దసరా వేడుకల కరపత్రాలను జిల్లా కలెక్టర్ రాజర్షి షా సమితి సభ్యులతో కలిసి విడుదల చేశారు. దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అష్టమి తిథిని పురస్కరించుకుని సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ను కలిసారు. పండితుల వేద పఠనం మధ్య కలెక్టర్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు కలెక్టర్‌కు అమ్మవారి చండీయాగ ప్రసాదాన్ని అందజేశారు. ఉత్సవాలను వైభవంగా శాంతియుతంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు సంతోష్ శర్మ , సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రధాన కార్యదర్శి రేణికుంట రవీందర్, గౌరవ అధ్యక్షులు కందుల రవీందర్ మహిపాల్, ఊరాడే సుభాష్, విజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## రాజర్షి షా గూడను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం

- **గ్రామంలో మెగా ఉచిత వైద్య శిబిరం**
- **ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కలెక్టర్ హితవు**




**ఆదిలాబాద్ మహా**: రాజర్షి షా గూడ గ్రామాన్ని అన్ని రకాల మౌలిక వసతులతో జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గ్రామ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు, అభివృద్ధి పనులను ప్రణాళికా బద్ధంగా చేపడతామని తెలిపారు.ఆదివారం ఆదిలాబాదు గ్రామీణ మండలం రాజర్షి షా గూడ గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఆదిలాబాద్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో వైద్యులను సంప్రదించి తగిన చికిత్స పొందాలని తెలిపారు. కొత్తగా ఏర్పాటైన రెడ్ క్రాస్ సొసైటీ తన తొలి సేవా కార్యక్రమాన్ని రాజర్షి షా గూడలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో నిర్వహించే ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తామని తెలిపారు. వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులు, వైద్యులు, రెడ్ క్రాస్ స్వచ్ఛంద కార్యకర్తలను కలెక్టర్ అభినందించారు.తన పేరును గ్రామానికి పెట్టినందుకు రాజర్షి షా గ్రామస్థులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. రహదారులు, నివాసాలు తదితర సౌకర్యాలను మెరుగుపరుస్తూ రాజర్షి షా గూడను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.మెగా ఉచిత వైద్య శిబిరానికి గ్రామస్థులు అధిక సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. రెడ్ క్రాస్ సొసైటీ స్వచ్ఛంద కార్యకర్తలు శిబిరంలో సేవలందించారు. అనంతరం గ్రామస్తులు, అధికారులతో కలిసి కలెక్టర్ సహపంక్తి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ అధ్యక్షులు డా. క్రాంతి కుమార్, రిమ్స్ డైరెక్టర్ జయసింగ్ సింగ్ రాథోడ్, డీఏం అండ్ హెచ్ ఓ సాధన, సంక్షేమ శాఖ ల అధికారులు మనోహర్, సునిత, తహశీల్దార్ గోవింద్, సర్పంచ్ లక్ష్మిబాయి, ఇతర అధికారులు, వైద్య సిబ్బంది, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ పంపిణీలో 30 రూపాయలు అక్రమ బాదుడు.!?

- **క్యాష్ మెమో బిల్లు కంటే అదనపు వసూళ్లు.. పట్టించుకోని అధికారులు**
- **ఏజెన్సీ కార్యాలయాల వద్ద కనిపించని సమాచార సూచిక బోర్డులు**
- **ప్రశ్నిస్తే పంపిణీ నిలిపివేస్తూ దురుసు ప్రవర్తన**
- **వినియోగదారులు ఇవ్వాల్సిన అవసరం లేకున్నా బలవంతపు వసూళ్లు**
- **ఏజెన్సీ డెలివరీ కమిషన్ ఇచ్చినా డ్రైవర్ల చేతివాటం**
- **వినియోగదారుల హక్కులు కాలరాస్తున్నా ప్రజాసంఘాలు, ప్రజాప్రతినిధుల మౌనం**




మంచిర్యాల, మహా ప్రతినిధి : మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా భారత్ గ్యాస్, హెచ్‌పీ గ్యాస్, ఇండేన్ గ్యాస్ వినియోగదారులను అదనపు చార్జీల పేరుతో ఆటో డ్రైవర్లు, డెలివరీ సిబ్బంది విపరీతంగా దోచుకుంటున్నారు. నిబంధనల ప్రకారం వినియోగదారుడి ఇంటికి సిలిండర్ చేర్చినందుకు గానూ కస్టమర్ కేవలం 'అధికారిక క్యాష్ మెమో (రసీదు)'లో ముద్రించిన మొత్తాన్ని మాత్రమే చెల్లించాలి. కానీ, ప్రతీ సిలిండర్‌కు 30 రూపాయలు అదనంగా ఇస్తేనే సిలిండర్ ఇస్తామని, లేదంటే వెనక్కి తీసుకెళ్తామని డెలివరీ ఆటో డ్రైవర్లు బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. అదనంగా 30 రూపాయలు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తున్న వినియోగదారులపై ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో.! అంటూ దురుసుగా మాట్లాడుతుండడంతో జిల్లా వ్యాప్తంగా రోజూ పలు గ్రామాలు, పట్టణాలలో వివాదాలు తలెత్తుతున్నాయి.

**ఏజెన్సీలు, డెలివరీ బాయ్స్ ఆర్థిక లావాదేవీలు – ప్రభుత్వ నిబంధనలు**

ఈ అక్రమ వసూళ్ల వెనుక ఉన్న అసలు వివరాలను పరిశీలిస్తే వినియోగదారులకు స్పష్టమైన అవగాహన కలుగుతోంది. (హెచ్.పి., భారత్, ఇండేన్) గ్యాస్ ప్రతి 14.2 కేజీల గృహ వినియోగ సిలిండర్‌పై గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యానికి దాదాపు 48 రూపాల నుండి 74 వరకు స్థిరమైన కమిషన్‌ను చెల్లిస్తాయి. గోదాము నిర్వహణ, రవాణా, డెలివరీ ఖర్చులు అన్నీ ఈ కమిషన్, బిల్లు మొత్తంలోనే కలిసి ఉంటాయి.

**డెలివరీ చేసే వారికి ఎవరు డబ్బులు ఇవ్వాలి..?**

గ్యాస్ సిలిండర్లను కస్టమర్ల ఇళ్లకు చేరవేసే డెలివరీ సిబ్బందికి గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యాలే పూర్తి బాధ్యత వహించి వేతనాలు చెల్లించాలని నిబంధనలు ఉన్నాయి. ఏజెన్సీ యజమానులు డెలివరీ బాయ్స్‌కు నెలవారీ జీతంతో పాటు, వారు డెలివరీ చేసే ప్రతి సిలిండర్‌కు 20 నుండి 30 రూపాల వరకు కమిషన్ ఇస్తారు. ఈ క్రమంలో కస్టమర్లు డెలివరీ బాయ్‌కి రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని నిబంధనలలో ఉన్నాయి. ఒకవేళ డెలివరీ బాయ్స్ లకు వినియోగదారులు డబ్బులు ఏమైనా ఇవ్వదలిస్తే కేవలం వారి స్వచ్ఛంద నిర్ణయం మాత్రమే తప్ప తప్పనిసరి కాదని వినియోగదారుల ఫోరం నిబంధనలు కూడా స్పష్టం చేస్తున్నాయి.

**కార్యాలయాల వద్ద సమాచార సూచికల కరువు**

జిల్లాలోని పలు గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాల వద్ద కస్టమర్లు ఎంత మొత్తం చెల్లించాలి..? రవాణా చార్జీలు బిల్లులోనే ఉంటాయా..? ఫిర్యాదు చేయాల్సిన అధికారులు ఎవరు..? అనే అంశాలపై ఎటువంటి సమాచార (సమాచార సూచిక/సిటిజన్ చార్టర్) బోర్డులు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. గతంలో అదనంగా 30 రూపాయలు వసూలు చేసిన ఘటనలపై వినియోగదారుల ఫోరమ్‌లు ఏజెన్సీలకు భారీ జరిమానాలు విధించిన దాఖలాలు ఉన్నప్పటికీ, జిల్లా పౌరసరఫరాల అధికారులు, సంబంధిత అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**పాలకులు, ప్రజాసంఘాల మౌనంపై అనుమానాలు**

జిల్లా వ్యాప్తంగా రోజూ వేలాది సిలిండర్ల పంపిణీ జరుగుతోంది. ప్రతీ సిలిండర్‌కు 30 రూపాయల చొప్పున లెక్కగడితే ఏజెన్సీలు, ఆటో డ్రైవర్ల సిండికేట్ నెలకు లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొడుతోంది. ప్రజలకు అండగా ఉండాల్సిన స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికార పార్టీ నాయకులు, ప్రజాసంఘాలు ఈ దోపిడీపై నోరు మెదపకపోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి గ్యాస్ ఏజెన్సీలపై తనిఖీలు చేపట్టి, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.



## పండుగల వేళ గ్యాస్ కష్టాలు లేకుండా చూడాలి..

- **సకాలంలో సిలిండర్లు అందించని ఏజెన్సీని మార్చాలని..**
- **సింగరేణి సూపర్ బజార్ డివిజనల్ మేనేజర్‌కు టీబీజీకేఎస్ వినతి..**

**మణుగూరు, మహా :** పండుగలు, శుభకార్యాల సమయంలో సింగరేణి కార్మిక కుటుంబాలకు వంటగ్యాస్ కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) మణుగూరు ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి కోరారు. ఈ మేరకు ఆదివారం కొత్తగూడెం సింగరేణి సూపర్ బజార్ డివిజనల్ మేనేజర్ దేవదాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగెల్లి మాట్లాడుతూ.. పండుగల వేళ గ్యాస్ సిలిండర్లకు డిమాండ్ పెరుగుతున్న దృష్ట్యా సరిపడా నిల్వలు అందుబాటులో ఉంచాలని కోరారు. సిలిండర్లు బుక్ చేసుకున్నప్పటికీ సకాలంలో ఇంటికి చేరకపోవడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. డెలివరీ కాంట్రాక్టు పొందిన ఏజెన్సీ నిర్వాహకులు సకాలంలో సిలిండర్లు సరఫరా చేయకపోవడంతో కార్మికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందన్నారు. సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తున్న ప్రస్తుత డెలివరీ ఏజెన్సీని మార్చి, సమర్థవంతంగా సేవలందించే కొత్త ఏజెన్సీకి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్, అధిక ధరలకు విక్రయాలు, కృత్రిమ కొరత సృష్టించడం వంటి అక్రమాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. గ్యాస్ నిల్వలు, బుకింగ్‌లు, డెలివరీ వ్యవస్థపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా పండుగల సమయంలో కార్మిక గృహిణులు వంటగ్యాస్ కోసం ఇబ్బందులు పడకుండా యాజమాన్యం ప్రత్యేక దృష్టిసారించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు మునిగేల నాగేశ్వరరావు, బడే హరీష్, మురళీకృష్ణ, శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రిలో దమ్మ పరివర్తన మహోత్సవం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న కారుకొండ రామవరం జూబ్లీ పురంలో ఆదివారం బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, రిపబ్లిక్ ట్రైనింగ్ స్కూల్, బహుజన విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో నవయాన బోధి సత్వ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 70వ దమ్మ దీక్ష పరివర్తన మహోత్సవ కార్యక్రమాన్ని మేధావులు విద్యావంతులు అంబేద్కరిస్ట్స్ బుద్దిస్ట్స్ ల సమక్షంలో ఘనంగా నిర్వహించినట్లు జిల్లా అధ్యక్షురాలు కొచ్చెర్ల కమల రాణి తెలిపారు. కళింగ యుద్ధం తరువాత యుద్ధంలో చనిపోయిన ఇరువర్గాల సైనికులు చనిపోయిన విధానానికి చలించిపోయి విజయ దశమి రోజున సామ్రాట్ అశోకుడు బౌద్ధాన్ని స్వీకరించి భారతావనిని సుభిక్షంగా పాలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉమ్మడి ఇన్నయ్య, రిటైర్డ్ జియం శనగ వెంకటేశ్వర్లు, మహమ్మద్ నబి దంపతులు, షాలిక్ బడ్కె దంపతులు, సింగరేణి జియం కనకయ్య, ఇరిగేషన్ డిపార్ట్మెంట్ డిఇ రాణి, బూర్గుల కరుణాకర్, భీమ్, మేఘన, ఎజియం చంద్రమౌళి, ప్రషీల్ దంపతులు, బొమ్మెర శ్రీనివాస్ కుటుంబం, మణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.





## ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల దీక్షకు ఏఐటీయూసి మద్దతు

**ఆదిలాబాద్ మహా:** జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం ఎదుట గత ఆరు రోజులుగా నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు చేపట్టిన దీక్షకు ఏఐటీయూసీ పూర్తి మద్దతు ప్రకటించింది. ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వారి న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. విలాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్‌తో కలిసి దీక్షా శిబిరాన్ని సందర్శించి ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు జేఏసీగా ఏర్పడి తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం దీక్షలు, వినూత్న నిరసన కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని అన్నారు.ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, అర్హతలు, వర్తించే నిబంధనల ప్రకారం వారిని క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల్లో క్రమబద్ధీకరణకు సంబంధించి అమలవుతున్న విధానాలను పరిశీలించి, తెలంగాణలో కూడా దీర్ఘ కాలంగా పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలకు తగిన విధానపరమైన పరిష్కారం చూపాలని కోరారు.సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంతో పాటు, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే నిబంధనల ప్రకారం ఇన్సూరెన్స్, సంక్షేమ పథకాలు, ఇతర సామాజిక భద్రతా ప్రయోజనాలు అందించాలని డిమాండ్ చేశారు.ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించే వరకు, వారు చేపట్టే శాంతియుత ప్రజాస్వామ్య ఉద్యమానికి ఏఐటీయూసీ అండగా ఉంటుందని విలాస్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎన్ హెచ్ఎం జేఏసీ అధ్యక్షులు దొంతుల ప్రవీణ్, ఉపాధ్యక్షులు డాక్టర్ ఈశ్వర్, డాక్టర్ సుజాత, కోశాధికారి డి. గితేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గోపాల్, డాక్టర్ జక్కుల నరేందర్, డాక్టర్ సంతోష్, శ్రీకాంత్ సోనీ, సురేందర్, శ్రీనివాస్, నాగార్జున్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.



## రావణ దహన ఏర్పాట్లు

**ఆదిలాబాద్ మహా:** సనాతనహిందూ ఉత్సవసమితి ఆధ్వర్యంలో గత 14ఏళ్లుగా దసరా వేడుకలు నిర్వహిస్తున్నామని సమితి అధ్యక్షుడు ప్రమోద్ ఖత్రి తెలిపారు. ఆదివారం సమితి సభ్యులతో కలిసి డైట్ మైదానంలో రావణ దహన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. మంగళవారం సాయంత్రం నిర్వహించే రావణ దహన కార్యక్రమానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను తిలకించి విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సనాతన హిందూ ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షుడు కందుల రవీందర్, ప్రధాన కార్యదర్శి రేణికుంట రవీందర్, కార్యనిర్వక అధ్యక్షులు దశరథ్, ఉపాధ్యక్షులు సామనపల్లి నర్సింలు , మీసాల స్వామి , మహిపాల్ , విజయ్ , యురాడే సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



## నాలుగు గ్రామాలకు అంగన్‌వాడీ భవనాలు మంజూరు.. రూ.48 లక్షల నిధుల కేటాయింపు

**మంత్రి శ్రీధర్ బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య.**

**పాలకుర్తి, అక్టోబర్ 18 మహా :** పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గ పరిధిలోని పాలకుర్తి మండలంలో గ్రామీణ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. మండలంలోని నాలుగు గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.48 లక్షల నిధులు మంజూరు చేయడంపై డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ నిధుల మంజూరుకు ప్రత్యేక చొరవ చూపిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.మండలంలోని బామ్లా నాయక్ తండా, కన్నాల, జీడినగర్, రాణాపూర్ గ్రామాల్లో ఒక్కో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రూ.12 లక్షల చొప్పున మొత్తం రూ.48 లక్షలు మంజూరయ్యాయని సూర సమ్మయ్య పేర్కొన్నారు. ఈ భవనాల నిర్మాణం పూర్తయితే చిన్నారులకు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని, వారి ఆరోగ్యం, పౌష్టికాహారం, ప్రాథమిక విద్యాభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. గ్రామీణ అభివృద్ధికి ప్రభుత్వ ప్రాధాన్యం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగడం అభినందనీయమని సూర సమ్మయ్య అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు గర్భిణులు, బాలింతలకు అవసరమైన సేవలు అందిస్తున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం ఆయా గ్రామాల ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు.ప్రజల అవసరాలను గుర్తించి గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయించడంలో మంత్రి శ్రీధర్ బాబు చూపుతున్న చొరవ ప్రశంసనీయమని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు పేద కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టాలని ఆకాంక్షించారు. నాలుగు గ్రామాల ప్రజల తరపున కృతజ్ఞతలు. బామ్లా నాయక్ తండా, కన్నాల, జీడినగర్, రాణాపూర్ గ్రామాలకు అంగన్‌వాడీ భవనాలు మంజూరు చేసినందుకు ఆయా గ్రామాల ప్రజల తరఫున మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు సూర సమ్మయ్య హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులోనూ పాలకుర్తి మండలంలోని గ్రామాలకు మరిన్ని అభివృద్ధి పనులు మంజూరై ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు.

## ఇంట్లో బంగారు, వెండి ఆభరణాల చోరీ

**కుషాయిగూడ, మహా** : కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో చోరీ జరిగింది. కాలనీకి చెందిన ఎ. జయలక్ష్మి (72) ఈ నెల 16న మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి షాపింగ్‌కు వెళ్లారు. సాయంత్రం 6 గంటలకు తిరిగి వచ్చి చూడగా ఇంటి గ్రిల్ గేటు, బీరువా తెరిచి ఉండటాన్ని గుర్తించారు. బీరువాలోని విలువైన బంగారు, వెండి ఆభరణాలు కనిపించకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు అనుమానిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.





# సేవా కార్యక్రమాల్లో చంద్రమోహన్‌కు ప్రత్యేక గుర్తింపు..

- హంగర్ రిలీఫ్ సేవలకు వ్యక్తిగత అవార్డు
- మణుగూరు లయన్స్ క్లబ్‌కు ఏడు అవార్డులు

**మణుగూరు, మహా :** నిరంతర సేవా కార్యక్రమాలతో సమాజసేవలో ప్రత్యేక గుర్తింపు పొందిన లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ (హంగర్ రిలీఫ్) లయన్ కముజు చంద్రమోహన్ వ్యక్తిగత సేవా పురస్కారాన్ని అందుకున్నారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 320ఈ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఇమ్మీడియట్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మదన్‌మోహన్ రేపాల చేతుల మీదుగా చంద్రమోహన్ ఈ పురస్కారాన్ని స్వీకరించారు. మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంతో పాటు బాలవెలుగు పాఠశాల విద్యార్థులకు గత రెండేళ్లుగా ప్రతి ఆదివారం పోషకాహారంగా కోడిగుడ్లు అందజేస్తూ చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేశారు. దీంతోపాటు 2009 నుంచి ఏటా జూలై 9న తన జన్మదినాన్ని పురస్కరించుకొని బాలవెలుగు విద్యార్థులకు క్రమంతప్పకుండా స్టడీ మెటీరియల్ పంపిణీ చేయడంతో పాటు అవసరమైన సందర్భాల్లో పాఠశాలకు సహాయ సహకారాలు అందిస్తున్నందుకు చంద్రమోహన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. సుదీర్ఘకాలంగా విద్యార్థుల సంక్షేమం, పోషకాహారం, విద్యాభివృద్ధికి ఆయన అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. కాగా, వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన మణుగూరు లయన్స్ క్లబ్‌కు మొత్తం ఏడు అవార్డులు లభించాయి. ఈ కార్యక్రమంలో ఇమ్మీడియట్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మదన్‌మోహన్ రేపాల, అవార్డు గ్రహీత లయన్ కె. చంద్రమోహన్‌తో పాటు లయన్స్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

# రామరామ ఉయ్యాలో.. రామణేసి రామ ఉయ్యాలో..

- తీరొక్క పూలతో బతుకమ్మలు.. ఆటపాటలతో ఆడపడుచుల సందడి
- కరీంనగర్ జిల్లావ్యాప్తంగా ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



**కరీంనగర్ మహా :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు కరీంనగర్ జిల్లావ్యాప్తంగా అంబరాన్నంటాయి. తీరొక్క పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఆడపడుచులు సంబరాలు చేసుకున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు మహిళలంతా ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ ఆటపాటలతో పండుగ వాతావరణాన్ని నింపారు.
కరీంనగర్ నగరంతో పాటు మానకొండూరు, చొప్పదండి, హుజూరాబాద్ నియోజకవర్గాల్లో వేడుకలు వైభవంగా జరిగాయి. నగరంలోని టవర్ సర్కిల్, రాంనగర్, మంకమ్మ తోట, విద్యానగర్, ప్రకాశం గంజ్, అలుగునూరు, మానేరు వంతెన పరిసరాలతో పాటు అన్ని డివిజన్లు, వార్డుల్లో మహిళలు పెద్ద సంఖ్యలో ఒకచోట చేరి బతుకమ్మలను కొలువుదీర్చారు.

**ప్రకృతి పూలతో బతుకమ్మల అలంకరణ**

తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొత్త బట్టలు, సంప్రదాయ ఆభరణాలు ధరించిన మహిళలు తమ బతుకమ్మలను అందంగా అలంకరించి పండుగ సంబరాల్లో పాల్గొన్నారు. పూల సోయగాలు, మహిళల సందడి, సంప్రదాయ వేషధారణలతో వీధులు పండుగ శోభను సంతరించుకున్నాయి.

**కోలాటాలు.. బతుకమ్మ పాటలు**

బతుకమ్మల చుట్టూ చేరిన మహిళలు చప్పట్లు కొడుతూ, కోలాటాలు ఆడుతూ సంప్రదాయ పాటలతో సందడి చేశారు. 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. రామరామ ఉయ్యాలో.. రామణేసి రామ ఉయ్యాలో..' అంటూ గొంతెత్తి పాడుతూ ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు. తరతరాలుగా వస్తున్న బతుకమ్మ సంప్రదాయాలను గుర్తుచేసుకుంటూ చిన్నారులకు సైతం పండుగ విశిష్టతను తెలియజేశారు.

**సద్దులతో సంప్రదాయ వేడుక**

బతుకమ్మలతో పాటు సత్తుపిండి తదితర సద్దులను తీసుకొచ్చి మహిళలు పరస్పరం పంచుకున్నారు. పూల పండుగగా ప్రసిద్ధి చెందిన బతుకమ్మ వేడుకలు మహిళల మధ్య ఆత్మీయతను, ఐక్యతను చాటిచెప్పాయి. తెలంగాణ ఆడపడుచుల జీవనశైలిలో భాగమైన ఈ పండుగను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకొని సద్దుల బతుకమ్మకు ఘనంగా వీడ్కోలు పలికారు.











# ట్టభద్రుల ఓటరు నమోదును వేగవంతం చేయాలి..

- నమోదు ప్రక్రియను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే రేగా..

**మణుగూరు, మహా :** వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని పినపాక మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు రేగా కాంతారావు పార్టీ శ్రేణులకు సూచించారు. ఆదివారం మణుగూరు పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు జరుగుతున్న తీరును నాయకులు, కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. నమోదు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# బొడ్రాయి మహా కుంభాభిషేకానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

**కుషాయిగూడ, మహా:** ఉప్పల్ ప్రాంతంలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న బొడ్రాయి (నాభిశిల) పుష్కర మహా కుంభాభిషేక మహోత్సవాలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని నిర్వాహకులు ఆహ్వానించారు. సైనిక్‌పురిలోని ఎమ్మెల్యే నివాసంలో గ్రామస్థులు, కాలనీవాసులు, బొడ్రాయి కమిటీ సభ్యులు ఆయనను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. 12 ఏళ్లకు ఒకసారి నిర్వహించే ఈ మహోత్సవాలను మూడు రోజులపాటు ప్రత్యేక పూజలతో భక్తిశ్రద్ధలతో జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 23న శుక్రవారం ప్రారంభమై 25న ఆదివారం వరకు వేడుకలు కొనసాగుతాయన్నారు. గ్రామ సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే ఈ ఉత్సవాల్లో భక్తులు, గ్రామస్థులు, కాలనీవాసులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

# బతుకమ్మ, దసరా పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

**డీసీపీ భూక్య రాంరెడ్డి**

**పెద్దపల్లి మహా :** బతుకమ్మ, దసరా పండుగలను ప్రజలందరూ సంతోషంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పెద్దపల్లి డీసీపీ భూక్య రాంరెడ్డి కోరారు. పండుగల సందర్భంగా మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెద్దపల్లి పట్టణంలోని డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజలకు ముందస్తుగా సద్దుల బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. బతుకమ్మ సంబరాల సమయంలో మహిళల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా, అమర్యాదగా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ హెచ్చరించారు. మద్యం సేవించి రోడ్లపైకి వచ్చి ఇతరులకు ఇబ్బందులు కలిగించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. బతుకమ్మ ఆడుకునే సమయంలో మహిళలు చైన్ స్నాచింగ్ వంటి ఘటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పండుగల వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ తరపున ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రజలందరూ పోలీసులకు సహకరిస్తూ బతుకమ్మ, దసరా పండుగలను ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని డీసీపీ భూక్య రాంరెడ్డి కోరారు.



# నూతన పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్....

రాజేంద్రనగర్ మహా : అత్తాపూర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో నూతన 450 ఎంఎం పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆదివారం కాలనీ వాసులతో కలిసి శంకుస్థాపన చేశారు. తాగునీటి సరఫరా, డ్రైనేజీ సమస్యల మెరుగుదల కోసం వాటర్ బోర్డు ఆధ్వర్యంలో సుమారు 23.20 లక్షల అంచనా వ్యయంతో ఈ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,అధికారులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# అమ్మవారి ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమంలో సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

**తోకల శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్ మహా :** దేవీ నవరాత్రి దసరా ఉత్సవాల్లో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీ, కాటేదాన్, పలు కాలనీలలో ప్రతిష్ఠించిన అమ్మవారి మండపాలను ఆదివారం సందర్శించి, ప్రత్యేక పూజా, అన్నదాన కార్యక్రమాల్లో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, అమ్మవారి చల్లని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ మరోసారి సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పాండు యాదవ్, అడికె జనార్ధన్, రావుల భాస్కర్, శ్రీకాంత్ రెడ్డి, నర్సిరెడ్డి రమేష్, శంకర్ రెడ్డి, అడికె శివ, అంజమ్మ, రాజేష్ ,రవి, నిఖిల్, కార్తీక్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# నాగారంలో వైభవంగా బతుకమ్మ సంబరాలు

**వేలాదిగా తరలివచ్చిన మహిళలు**
**వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ,.మహా :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని నాగారంలో కౌకుంట్ల అనంత్ రెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ మంత్రి.సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శ్రీనివాస్, మాజీ చైర్మన్ శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా నేతలుమాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌తో పాటు వేలాది మంది మహిళలు ఉత్సాహంగా బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళలు సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించి తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పారు. తెలంగాణ ఆడబిడ్డలకు బతుకమ్మ పండుగ ఎంతో ప్రత్యేకమైనదని, ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ, మహిళల ఐక్యతను చాటిచెప్పే ఈ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. వేలాది మంది మహిళల పాల్గొనడంతో నాగారంలో బతుకమ్మ సంబరాలు పండుగ వాతావరణంలో అంగరంగ వైభవంగా జరిగాయి.

# వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

**ధైర్యలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనం.**

రాజేంద్రనగర్ మహా ; స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో కన్నులపండువగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఎనిమిదో రోజు ఆదివారం అమ్మవారు ధైర్యలక్ష్మిగా భక్తులకు అభయమిస్తూ దర్శనం ప్రసాదించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ పవిత్రమైన రోజున ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి అత్యంత నిష్ఠతో, శాస్త్రోక్తంగా నారసింహ ఇష్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. వేద పండితులు, రుత్వికుల మంత్రోచ్ఛారణలు, వేదనాదాల మధ్య జరిగిన ఈ పూజా కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి నామస్మరణతో ముచ్చింతల్ క్షేత్రమంతా మార్మోగింది.



**వైభవంగా బతుకమ్మ సంబరాలు**

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలను వైభవంగా నిర్వహించారు. మహిళలు సంప్రదాయ రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలను ఏర్పాటు చేసి, వాటి చుట్టూ చేరి బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. వివిధ రకాల పుష్పాలతో అందంగా పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా బతుకమ్మను కొలుస్తూ ఉత్సవాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ ప్రాంగణం భక్తి, సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనంతో నిండిపోయింది.

# నెహ్రూ నగర్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**హాజరైన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ, మహా :** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని నెహ్రూ నగర్ కాలనీలో అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలు జరిగాయి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే. బండారు లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. నెహ్రూ నగర్ కాలనీల మహిళలతో కలిసి వేడుకల్లో పాల్గొని వారి కుటుంబాలకు బతుకమ్మ పండుగ గొప్పదనం గురించి వివరించారు. వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలతో నెహ్రూ నగర్ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. సంప్రదాయ దుస్తుల్లో హాజరైన మహిళాలు కుటుంబ సభ్యులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ కోలాటాలతో సందడి చేశారు. తెలంగాణ వివిధ జిల్లాల నుండి వలస వచ్చిన ప్రజలు అన్ని జిల్లాల ప్రజలు ఈ వేడుకలు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాయి. ఉప్పల్ జోన్ అడిషనల్ డీసీపీ. వెంకటరమణ మాట్లాడుతూ కాలనీలా ప్రజలు . మహిళల.మధ్య ఐక్యత, ఆత్మీయతను పెంపొందించేల ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బండారు నీలం రెడ్డి, మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు. కాంటెస్టెంట్ కార్పొరేటర్ బోధస్ లక్ష్మీనారాయణ, స్థానిక పార్టీ నాయకులు చిన్న దుర్గయ్య, రాములు, మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొని బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.



# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

- నెహ్రూనగర్‌లో ఘనంగా బతుకమ్మ సంబురాలు పాల్గొన్న బండారు నీలం రెడ్డి

**కుషాయిగూడ, మహా:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బండారు నీలం రెడ్డి అన్నారు. మల్లాపూర్ డివిజన్ నెహ్రూనగర్‌లో శనివారం రాత్రి బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి ఆయన బతుకమ్మ ఆడారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి మహిళలు, చిన్నారులు సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా బండారు నీలం రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రజలందరికీ బతుకమ్మ, సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ కాలనీల్లో మహిళలు బతుకమ్మలను అందంగా అలంకరించి ఉత్సాహంగా వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి వేడుకలు కీలకమని పేర్కొన్నారు. ప్రజలందరికీ ముందస్తు దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బోధస్ లక్ష్మీనారాయణ, చిన్న దుర్గయ్య, వెంకటేష్, మహిళలు, చిన్నారులు, కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## నేడు ఇబ్రహీంపట్నానికి సీఎం.!

**పోలీస్ కమిషనరేట్ భవనాన్ని ప్రారంభించనున్న సీఎం**

**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 18 మహా:** ఇబ్రహీంపట్నం నాగన్‌పల్లి రోడ్డులో ఫ్యూచర్‌సిటీ పోలీస్ కమిషనరేట్ నూతన భవనాన్ని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేడు సోమవారం ప్రారంభించనున్నట్లు, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో హైదరాబాద్ తో సహా మరో రెండు పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా భారత్ ఫ్యూచర్ సిటీ పేరుతో ఏర్పాటుచేసిన పోలీస్ కమిషనరేట్ ను, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా, ఈరోజు ప్రారంభించుకొనున్నట్లు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు.

# రావణవధ కు ఏర్పాట్లు పూర్తి

- **దసరా ఉత్సవ సమితి అధ్యక్షులు గుండు పూర్ణ చందర్**
- **ఉత్సవ సమితి ప్రతినిధులతో కలిసి కరపత్రాల ఆవిష్కరణ**



**రంగశాయిపేట, మహా** : వరంగల్ నగరంలోని రంగశాయిపేటలోని మహంకాళి దేవాలయ ఆవరణలో రావణవద కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయ్యాయని దసరా ఉత్సవ సమితి అధ్యక్షులు గుండు పూర్ణ చందర్ అన్నారు. ఆదివారం మహంకాళి దేవాలయ ఆవరణలో దసరా ఉత్సవ సమితి ప్రతినిధులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించినారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి అధ్యక్షులు గుండు పూర్ణచందర్ మాట్లాడుతూ గతంలో 1984వ సంవత్సరంలో ఆనాటి పెద్దలు రావణ వధ కార్యక్రమానికి శ్రీకారం చుడితే 2003 వ సంవత్సరం నుండి ప్రతి ఏటా క్రమం తప్పకుండా గ్రామ పెద్దలందరి సహకారాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. విజయదశమి పండుగను పురస్కరించుకొని మంగళవారం రోజున సాయంత్రం మహంకాళి గుడి ఆవరణలో నిర్వహించే ఈ రావణ వద కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ, విశిష్ట అతిథిగా కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్ పర్సన్ గుండు సుధారాణి ప్రభాకర్, గౌరవ అతిథులుగా వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ మంత్రి శాసనమండలి సభ్యులు బసవ రాజు సారయ్య, ప్రత్యేక అతిథులుగా హైదరాబాద్ ఫస్ట్ అడిషనల్ ఫ్యామిలీ కోర్టు కం 14వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి డాక్టర్ కంచ ప్రసాద్, సీనియర్ పాత్రికేయులు శంకేసి శంకర్ రావు, 42వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్, 41వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పోశాల పద్మ స్వామి, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ జనార్ధన్ లు విచ్చేస్తున్నారని గుండు పూర్ణచందర్ తెలిపారు. ఈ సంవత్సరం 36 ఫీట్ల రావణ ప్రతిమ తోపాటు వివిధ రకాల మిరిమిట్లు గొలిపే బాణాసంచాలను ఏర్పాటు చేశామని తెలిపారు. జిడబ్ల్యూఎంసి ద్వారా పూర్తిస్థాయిలో లైటింగ్, స్టేజి, మైదానమంతా డస్ట్ పోయించడంతో పాటు ఆర్ అండ్ బి ద్వారా భారీ కేడింగ్, అగ్నిమాపక శాఖ ద్వారా ఫైర్ ఇంజన్ ను కూడా ఏర్పాటు చేయిస్తున్నామని అన్నారు. అనంతరం ప్రధాన కార్యదర్శి దామెరకొండ కరుణాకర్ మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం ఏడు గంటల నుండి అత్యంత వైభవంగా నిర్వహించే ఈ రావణ వధ కార్యక్రమంలో ముందుగా రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మహంకాళి ఆవరణకు చేరుకుంటామని వివిధ సంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఆర్కెస్ట్రా ప్రోగ్రాం కూడా ఏర్పాటు చేశామని అన్నారు. కావున పుర ప్రజలంతా ఈ రావణ వద కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దసరా ఉత్సవ సమితి ఉపాధ్యక్షులు పరికిపండ్ల రాజేశ్వర్ రావు, కోశాధికారి కొక్కొండ భాస్కర్, ముఖ్య సలహాదారులు ముత్తినేని రామమూర్తి, మండల లక్ష్మయ్య, బివి రామకృష్ణ ప్రసాద్, డాక్టర్ పోతు దర్శనం, చిమ్మని చంద్రమౌళి, కార్యనిర్వాహక కార్యదర్శులు బక్కి వంశీ, కార్యదర్శులు బజ్జూరి వీరేశం, పస్తం బిక్షపతి, కత్తెరపల్లి వేణు, కార్యవర్గ సభ్యులు గుండు నవీన్ కుమార్, కన్నెబోయిన కుమార్, ఇట్టబోయిన ప్రదీప్ లతోపాటు పాలకుర్తి సుమన్ గౌడ్, శంకేసి అనిల్ కుమార్, మండల హరీష్ తదితరులు పాల్గొన్నారు.



## అమ్మ వారి ఆశిస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

**మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి**

**కుషాయిగూడ, మహా :** శరన్నరాత్రి ఉత్సవాలల్లో భాగంగా కుషాయిగూడ డివిజన్ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కాలనీ లో తులజా శ్రీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గా మాతా అమ్మవారికి 8వ రోజు ఆదివారం భక్తిశ్రద్దలతో ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పాల్గొని అమ్మ వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తులజా శ్రీ అసోసియేషన్ సభ్యులు మైనంపల్లిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ అమ్మ వారి ఆశిస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, బీకే శ్రీనివాస్, కాంగ్రెస్ మౌలాలి డివిజన్ అధ్యక్షులు పోతుల వినోద్ యాదవ్, ప్రవీణ్, చెన్నారెడ్డి, తులజా శ్రీ యూత్ అసోసియేషన్ సభ్యులు అఖిల్, అభి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



## తాత ప్రేమకు నిదర్శనం

- **దివ్యాంగురాలైన మనవరాలిని బతుకమ్మ వేడుకకు తీసుకొచ్చిన తాత**

**ఉర్సు, మహా ;** వరంగల్ నగరంలోని ఉర్సు రంగలీలా మైదానం బతుకమ్మ వేడుకల్లో అందరి దృష్టిని ఆకర్షించే ఘటన ఒకటి చోటు చేసుకుంది. వికలాంగురాలైన తన మనవరాలికి బతుకమ్మ సంబరాన్ని చూపించాలనే తపనతో ఓ తాత ఆ చిన్నారిని వీల్ చైర్ లో కూర్చోబెట్టుకొని ఉర్సు రంగలీలా మైదానానికి తీసుకొచ్చాడు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను చూసి ఆ చిన్నారి ముఖంలో వెల్లివిరిసిన ఆనందం అందరినీ కట్టిపడేసింది. తన శారీరక లోపాన్ని సైతం మర్చిపోయి ఆ చిన్నారి బతుకమ్మ పాటలకు చప్పట్లు కొట్టడం అక్కడున్న వారి హృదయాలను కదిలించింది. మనవరాలి సంతోషమే తన సంతోషంగా భావించి ఆమెను మైదానమంతా తిప్పుతూ వేడుకను చూపించిన ఆ తాతకు స్థానికులు ప్రశంసలు కురిపించారు. రక్త సంబంధం విలువను, మానవత్వాన్ని చాటిన ఈ దృశ్యం బతుకమ్మ వేడుకలకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన బండారు నీలం రెడ్డి

**కుషాయిగూడ, మహా :** నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మీర్పేట్ హౌసింగ్ బోర్డ్ డివిజన్ కాలనీలలో నిర్వహిస్తున్న అమ్మవారి ఉత్సవాల్లో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారు నీలం రెడ్డి. పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు వంజరి ప్రవీణ్ కరిపే, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





## దుర్గామాత సన్నిధిలో దసరా కత్తికి ఆయుధ పూజలు

- **గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు శివ పటేల్**

వరంగల్, మహా; గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్, ఎనుమాముల ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 1 లో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కాలనీకి చెందిన దాత బాశెట్టి సత్య నారాయణ దసరా కత్తిని బహుకరించారు. ఈ సందర్భంగా దసరా కత్తికి నిఖిల దత్త ఉపాసకలు శ్రీశ్రీశ్రీ వంగాల శ్రీనివాస చారి చేతుల మీదగా దుర్గామాత సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఆయుధ పూజలు నిర్వహించారు. అనంతరం కత్తిని కత్తి కొట్టే సంప్రదాయానికి చెందిన ముదిరాజ్ కులస్తులు శాగంటి నాగరాజు కు అందజేశారు.కాలనీలో దసరా ఉత్సవాలను రేపు ఏ కమిటీ ఉన్న ఇదే కత్తి తో ప్రతి సంవత్సరం సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకుదసరా కత్తిని శాశ్వతంగా అందజేయడం పట్ల కాలనీ వాసులు దాత బాశెట్టి సత్యనారాయణ కు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి దాతృత్వ కార్యక్రమాలు మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటంతో పాటు కాలనీవాసుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి నర్సింగోజు నరేంద్రచారి, ఉపాధ్యక్షుడు బండ్ల సురేందర్, కార్యదర్శి బింగి రమేష్, కుంభం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



## జగన్మాత దుర్గాదేవి

- **ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి**
- **అరుంధతి నగర్ లో ఘనంగా అన్నదాన కార్యక్రమం**
- **మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్**

జవహర్ నగర్, మహా : జగన్మాత దుర్గాదేవి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆ అమ్మవారిని వేడుకున్నట్టు మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. జవహర్ నగర్ చంద్రపురి కాలనీ అరుంధతి నగర్ లో ఉన్న సాయిబాబా దేవాలయం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఈటల రాజేందర్ హాజరై దుర్గామాత అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ జగన్మాత దుర్గాదేవి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రతి ఒక్కరు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. దేవీ నవరాత్రుల సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా భక్తి భావం సామాజిక ఐక్యత సమగ్రత పెంపొందించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్ రెడ్డి, చంద్రపురి కాలనీ 2 డివిజన్ బిజెపి అధ్యక్షులు కర్లపూడి జోగారావు, కమలాకర్, మహేందర్ యాదవ్, సన్నీ, రఘురాం చారి, మల్లికార్జున గౌడ్, మహేష్ గౌడ్, శ్రీ శివ కేశవ, వెంకటేష్, రాజు, మహేష్, విజయ్, సిహెచ్. రాజు, విగ్నేష్, రాము, బిజెపి కార్యకర్తలు ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ పోరులో బీజేపీ వ్యూహమేంటి?

- **బీసీ అభ్యర్థి వైపే కమలనాథుల మొగ్గు!**
- **అభ్యర్థి ఎంపిక పై పార్టీ కసరత్తు.. ఆశావహుల పై ఆరా**
- **మెజారిటీ నాయకులు డాక్టర్ వన్నాల వైపే నా?**
- **సంఘ్ నేపథ్యం, సామాజిక సేవలే అతని ధైర్యం**
- **పార్టీల అభ్యర్థుల ప్రకటనతో మారనున్న రాజకీయ సమీకరణాలు**



**వరంగల్, బ్యూరో మహా ;** వరంగల్, ఉమ్మడి వరంగల్‌ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కనున్నాయి. అధికార కాంగ్రెస్ నుంచి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని తమ పార్టీ అభ్యర్థిగా ప్రకటించి ఎన్నికల సన్నాహాలను ముమ్మరం చేసింది. ఇక ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ అధికారికంగా అభ్యర్థిని ప్రకటించకపోయినా ఏనుగుల రాకేష్ రెడ్డి ఇప్పటికే క్షేత్ర స్థాయిలో ఎన్నికల కార్యాచరణ సైతం ప్రారంభించడంతో ఆయనకే టికెట్ కన్ఫామ్ అన్న చర్చ జరుగుతోంది. ఇక జాతీయ పార్టీ బీజేపీ మాత్రం అభ్యర్థి ఎంపిక పై ఇంకా స్పష్టత ఇవ్వలేదు. దీంతో కమలనాథుల వ్యూహం ఏమిటన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. అభ్యర్థి ప్రకటనలో జాప్యం జరుగుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నప్పటికీ, సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు విశ్లేషణలు భావిస్తున్నారు. కాగా, తొలిసారి జనసేన నుంచి డాక్టర్ గడల శ్రీనివాసరావు ను ఆ పార్టీ అభ్యర్థిగా ప్రకటించింది.

**బీసీ వాదం.. బీజేపీ వ్యూహంలో కీలకమా.?**

ఉమ్మడి వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ప్రధాన పార్టీలు అగ్రవర్ణ సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులను దాదాపు ఖరారు, చేసిన నేపథ్యంలో బీజేపీ తమ పార్టీ అభ్యర్థిగా బీసీ ని బరిలోకి దించే అంశం చర్చకు వస్తున్నట్లు సమాచారం. తెలంగాణ రాజకీయాల్లో బీసీ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్న తరుణంలో పట్టభద్రుల నియోజకవర్గంలోనూ ఈ సమీకరణాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆ పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ నేతను ముఖ్యమంత్రిని చేస్తామన్న పార్టీ అగ్రనాయకత్వం గతంలో చేసిన ప్రకటన నేపథ్యంలో, ఈ స్థానానికి బీసీ అభ్యర్థిని ఎంపిక చేస్తారా? అన్న ఆసక్తి నెలకొంది.

**ఆశావహులపై అభిప్రాయ సేకరణ..**

ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేయాలని భావిస్తున్న పలువురు బీజేపీ నేతలు ఇప్పటికే తమ ఆసక్తిని వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇతర పార్టీల్లో అవకాశాలు ఆశించి నిరాశకు గురైన కొందరు నేతలు కూడా బీజేపీ వైపు చూస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, దీర్ఘకాలంగా సంస్థాగత కార్యక్రమాల్లో పనిచేసిన నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలన్న అభిప్రాయం పార్టీలో వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పార్టీ నేతలు, కార్యకర్తల అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు సమాచారం.

**రేసులో డాక్టర్ వన్నాల వెంకటరమణ పేరు!**

ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో సుపరిచితులైన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు పెద్ద కుమారుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ పేరు ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రధానంగా చర్చకు వస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ శ్రేణుల అభిప్రాయ సేకరణలో ఆయన పేరు ముందంజలో ఉందన్న ప్రచారం సాగుతోంది. అయితే, అభ్యర్థిత్వంపై పార్టీ అధిష్ఠానం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఉన్నత విద్యావంతుడైన డాక్టర్ వన్నాల వెంకటరమణ పీహెచ్‌డీ పూర్తి చేసి ప్రొఫెసర్‌గా పనిచేశారు. సంఘ్ నేపథ్యం కలిగిన కుటుంబం నుంచి వచ్చిన ఆయన, గత నాలుగేళ్లుగా తన డాక్టర్ వృత్తిని పక్కన పెట్టి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నట్లు ఆయన అనుచర వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. డాక్టర్ వన్నాల వెంకటరమణ బీసీ పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన వారు కావడం కూడా అభ్యర్థిత్వ చర్చలో ప్రస్తావనకు వస్తోంది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో పట్టభద్రుల ఓటర్లను ఆకర్షించేందుకు సామాజిక ప్రాతినిధ్యంతో పాటు విద్యార్హతలు, పార్టీ అనుబంధం, ప్రజాసేవ వంటి అంశాలు కీలకంగా మారే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

**అధిష్ఠానం నిర్ణయంపై ఉత్కంఠ**

బీజేపీ అభ్యర్థి ఎంపికలో సామాజిక సమీకరణాలు, విద్యార్హతలు, పార్టీకి చేసిన సేవలు, ప్రజల్లో ఉన్న గుర్తింపు వంటి అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాలకు చెందిన పార్టీ నాయకుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టగా, మెజారిటీ నాయకులు వన్నాల అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపినట్లు సమాచారం. దీనినే పార్టీ ముఖ్య నాయకులు కూడా అధిష్టానికి నివేదించినట్లు తెలుస్తోంది.

**మహిళ కైతే వన్నాల సతీమణి***బీసీ మహిళ కైతే డాక్టర్ వన్నాల వెంకటరమణ సతీమణి అవకాశం కల్పించాలన్న ఆలోచనను కూడా పార్టీ పరిశీలిస్తుందని పీహెచ్‌డీ పూర్తి చేసిన ప్రొఫెసర్ పాము పావని పేరును పరిగణనలోకి తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు ప్రతిపాదించినట్లు సమాచారం. విద్యారంగంలో అనుభవం ఉన్న మహిళకు అవకాశం కల్పించడం ద్వారా మహిళా పట్టభద్రులను ఆకర్షించవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఈ అంశంపై కూడా పార్టీ నుంచి అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

**సేవా కార్యక్రమాలతో గుర్తింపు**

రాజకీయ కార్యక్రమాలతో పాటు 'వాక్' స్వచ్ఛంద సంస్థ ద్వారా డాక్టర్ వన్నాల వెంకటరమణ పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు సమాచారం. దాదాపు 300 పేద కుటుంబాలకు ప్రతినెలా ఒక్కో కుటుంబానికి 10 కిలోల సన్నబియ్యం పంపిణీ చేయడం, అనాథ పిల్లల చదువులకు ఫీజులు చెల్లించడం, పేద కుటుంబాలకు అత్యవసర వైద్య ఖర్చుల విషయంలో అండగా నిలవడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

**బీజేపీ సిద్ధాంతాల కే కట్టుబడి ఉన్న నేతగా..**

ఏళ్ల తరబడి ఎన్ని ప్రలోభాలు ఎదురైనా బీజేపీ సిద్ధాంతాలకే కట్టుబడి ఉన్న నేతగా, పట్టభద్రులను ప్రభావితం చేయగల విద్యావేత్తగా డాక్టర్ వన్నాల వెంకటరమణ అభ్యర్థిత్వాన్ని స్థానిక బీజేపీ వర్గాలు కూడా ముక్తకంఠంతో మద్దతు తెలిపినట్లు సమాచారం. అధికారంలోకి వస్తే బీసీ సీఎం హామీకి విశ్వసనీయత పెరగాలన్నా, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అగ్ర వర్ణ అభ్యర్థులకు గట్టి సమాధానం ఇవ్వాలన్నా బీజేపీ నుంచి బీసీ విద్యావంతుడైన అభ్యర్థే బరిలో ఉండాలని కేడర్ గట్టిగా కోరుకుంటోంది. ఇక కాషాయ దళాధిపతులు బీసీ నినాదాన్ని అందిపుచ్చుకుని ఈ సీటును దక్కించుకుంటారా? లేక ఊహించని నిర్ణయం తీసుకుంటారా? అనేది త్వరలోనే తేలనుంది.



## ఆర్టీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంధ కూటమి ఘనవిజయం

హనుమకొండ, మహా ; తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ఉత్కంఠభరితంగా ముగిసిన తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగమైన ఐఎన్‌టీయూసీ తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ కూటమి అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఈ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మొత్తం 10 రీజన్ల (డిపోల)కు గాను ఏకంగా 6 రీజన్లలో ఘనవిజయం సాధించి ఐఎన్‌టీయూసీ కూటమి తన సత్తా చాటింది. ఈ చారిత్రాత్మక విజయానంతరం, ఐఎన్‌టీయూసీ ఆర్టీసీ యూనియన్ ముఖ్య నాయకులు జితేందర్ రెడ్డి, పాష, రమేష్, వేణు మాధవ్, వేణు గోపాల్, మోహన్ తో పాటు ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు కూర వెంకట్, డిసిసి మీడియా, కమ్యూనికేషన్ కమిటీ చైర్మన్ మార్క విజయ్ కుమార్ తో కలిసి ప్రతినిధులు ఆదివారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల విజయ కేతనం ఎగురవేసిన సందర్భంగా డీసీసీ అధ్యక్షునికి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి గెలుపొందిన కార్మిక నేతలకు, ఆర్టీసీ కార్మికులకు అభినందనలు తెలిపారు.



## క్రీడలతోనే మానసిక ఆరోగ్యం పెంపొందుతుంది

- **బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు రేణిగుంట్ల ప్రవీణ్**

**బెల్లంపల్లి ,మహా**: యువతకు క్రీడలతోనే మానసిక ఆరోగ్యం పెంపొందుతుందని టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. నెన్నెల మండలం చిత్తాపూర్ లో నిర్వహించిన ప్రీమియం లీగ్ (CPL) సీజన్ 2 క్రికెట్ ఫైనల్ కార్యక్రమానికి ఆయన హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సాధారణమే అని.. ఓటమి గెలుపుకు నాంది కావలి అని అన్నారు.యువత క్రీడల్లో రాణించాలని మత్తు పదార్థాలకు గంజాయికి బానిస కాకుండా క్రీడ పట్ల మక్కువ పెంచుకొని ఆదర్శంగా నిలవాలని, క్రీడలను ప్రోత్సహింస్తున్నందుకు చిత్తాపూర్ యువవకులను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు ముందు ముందు ఇంకా కొనసాగించాలని చిత్తాపూర్ లోని క్రీడా మైదానాన్ని మరింత ఆధునికరణ కోసం కృషి చేస్తానని తెలియజేశారు ఈ కార్యక్రమంలో చిత్తాపూర్ సర్పంచ్ కమల మల్లేష్, నెన్నెల సర్పంచ్ ఇబ్రహిం, చిత్తాపూర్ ఉపసర్పంచ్ వెంకటేష్, నెన్నెల మాజీ సర్పంచ్ శ్రీను, గ డాక్టర్ తిరుమలేష్,సి పి ఎల్ నిర్వాహకులు మహేందర్, రమేష్ ,మల్లేష్ తోపాటు క్రీడాకారులు అభిమానులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లాలో అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు

**పెద్దపల్లి మహా,** పెద్దపల్లి జిల్లావ్యాప్తంగా సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. జిల్లా పరిధిలోని గ్రామగ్రామాన మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయబద్ధంగా ఆటపాటలు, కోలాటాలతో సంబరాలు జరుపుకున్నారు. బతుకమ్మ పాటలతో పల్లెలన్నీ పండుగ శోభను సంతరించుకున్నాయి. సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు తగిన ఏర్పాట్లు చేపట్టారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకునేలా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. అధికారులు, పోలీసుల సమన్వయంతో జిల్లావ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలు ప్రశాంతంగా సాగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఎంతో ఉత్సాహంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకొని తమ సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పారు.



# బాలీవుడ్ హీరో టైగర్ ష్రాఫ్ కారుపై కాల్పులు..

బాలీవుడ్ యాక్షన్ హీరో టైగర్ ష్రాఫ్‌కు సంబంధించిన కాల్పుల ఘటన ముంబైలో తీవ్ర కలకలం రేపింది. అక్టోబర్ 18న ముంబైలోని జుహూ ప్రాంతంలో ఆయన ప్రయాణిస్తున్న కారును లక్ష్యంగా చేసుకుని గుర్తుతెలియని దుండగులు కాల్పులు జరిపినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ ఘటనతో బాలీవుడ్ సినీ పరిశ్రమలో ఒక్కసారిగా ఆందోళన నెలకొంది. అయితే ఈ కాల్పుల ఘటనలో టైగర్ ష్రాఫ్‌కు ఎలాంటి గాయాలు కాలేదని, ఆయన క్షేమంగా ఉన్నారని ముంబై పోలీసులు స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న ప్రాథమిక సమాచారం ప్రకారం, జుహూ పరిధిలోని పుష్ప పార్క్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ద్విచక్రవాహనంపై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు టైగర్ ష్రాఫ్ కారుపై కాల్పులు జరిపినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో నటుడి కారు డ్రైవర్ తీవ్రంగా గాయపడగా, సమీపంలో ఉన్న ఆటోరిక్షా డ్రైవర్ కూడా గాయపడినట్లు వార్తలు వెలువడ్డాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. టైగర్ ష్రాఫ్ సురక్షితంగా ఉండటంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఈ దాడి వెనుక అసలు కారణం ఏమిటన్నది ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దుండగుల ఆచూకీ కోసం దర్యాప్తు ప్రారంభించారు. సమీప ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తూ నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు ప్రయత్నిస్తున్నాయి. మరోవైపు, ఈ దాడికి లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు సంబంధం ఉన్నట్లు కొన్ని వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. సోషల్ మీడియాలో ఈ గ్యాంగ్‌కు చెందినవారిగా చెప్పుకుంటున్న వ్యక్తులు దాడికి బాధ్యత వహించినట్లు సమాచారం వెలువడినప్పటికీ, వారి వాదనలను పోలీసులు అధికారికంగా ధ్రువీకరించలేదు. ఈ నేపథ్యంలో దర్యాప్తు పూర్తయ్యే వరకు దాడి వెనుక ఉన్న వ్యక్తులు, వారి ఉద్దేశాలపై స్పష్టమైన నిర్ధారణకు రావడం సాధ్యం కాదు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఈ ఘటనపై విచారణకు ఆదేశించినట్లు సమాచారం. సినీ ప్రముఖుల భద్రతకు సంబంధించిన అంశం మరోసారి చర్చకు రావడంతో పోలీసులు ఈ కేసును తీవ్రంగా పరిగణిస్తున్నారు.



గతంలోనూ బాలీవుడ్ ప్రముఖులకు బెదిరింపులు వచ్చిన నేపథ్యంలో తాజా ఘటనపై సినీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. 'బాఘీ', 'బాఘీ 2', 'వార్' వంటి చిత్రాలతో యాక్షన్ హీరోగా గుర్తింపు పొందిన టైగర్ ష్రాఫ్‌కు దేశవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. ఆయన తన ఫిట్‌నెస్, మార్షల్ ఆర్ట్స్ నైపుణ్యాలు, స్టంట్స్‌తో ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించుకున్నారు. అలాంటి ప్రముఖ నటుడి వాహనంపై కాల్పులు జరిగాయన్న వార్త బయటకు రావడంతో అభిమానులు, సినీ ప్రేక్షకులు ఆందోళనకు గురయ్యారు. అయితే నటుడికి ఎలాంటి గాయాలు కాలేదని పోలీసుల ప్రకటనతో కొంత ఊరట లభించింది. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది. కాల్పులకు పాల్పడిన వ్యక్తులు ఎవరు, దాడికి కారణం ఏమిటి, దీనికి ఏదైనా ముఠాతో సంబంధం ఉందా అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అధికారిక విచారణలో వెల్లడయ్యే వివరాల ఆధారంగానే ఈ ఘటన వెనుక ఉన్న వాస్తవాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.

## మల్టీకలర్ సీక్వెన్స్

# గౌన్‌లో మెరిసిన సన్నీ లియోన్

ప్రముఖ నటి సన్నీ లియోన్ మరోసారి తన అందం, స్టైలిష్ ఫ్యాషన్‌తో అభిమానులను ఆకట్టుకుంటున్నారు. తాజాగా ఆమెకు సంబంధించిన ఫ్యాషన్ ఫొటోలు సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఐవరీ రంగు ఆధారంగా రూపొందించిన స్లీవ్‌లెస్ గౌన్‌లో సన్నీ లియోన్ ఎంతో అందంగా కనిపిస్తున్నారు. గౌన్‌పై వివిధ రంగులలో మెరిసే సీక్వెన్స్ డిజైన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. దుస్తులపై వంపులు తిరుగుతూ కనిపించే రంగురంగుల అలంకరణలు ఆమె లుక్‌కు ఆధునిక హంగులను అద్దుతున్నాయి. డీప్ వీ నెక్‌లైన్‌తో రూపొందించిన ఈ గౌన్ ఆమె ఫ్యాషన్ ఎంపికలోని ప్రత్యేకతను చాటుతోంది. ముదురు ఎరుపు రంగు బ్యాక్‌డ్రాప్ ముందు తీసిన ఫొటోల్లో సన్నీ లియోన్ ఎంతో ఆత్మవిశ్వాసంతో పోజులిస్తూ కనిపిస్తున్నారు. ఆమె ముఖంలో కనిపించే ప్రశాంతమైన చిరునవ్వు, ఆకట్టుకునే హావభావాలు ఫొటోలకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి. జుట్టును సహజంగా వదిలి సాఫ్ట్ వేవ్స్ స్టైల్‌లో అలంకరించుకోవడం ఆమె మొత్తం రూపానికి మరింత అందాన్ని జోడించింది. తేలికపాటి స్మోకీ ఐ మేకప్‌తో పాటు సహజమైన మేకప్‌ను ఎంచుకోవడం ద్వారా దుస్తులకే ప్రధాన ఆకర్షణ లభించేలా చూసుకున్నారు. చేతికి ధరించిన స్టేట్‌మెంట్ రింగులు కూడా ఆమె స్టైలింగ్‌లో ప్రత్యేకంగా కనిపిస్తున్నాయి. దుస్తుల రంగులు, సీక్వెన్స్ మెరుపులు, మేకప్, హెయిర్‌స్టైల్‌ను సమన్వయం చేసిన తీరు ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకునేలా ఉంది. సాధారణంగా గ్లామరస్ ఫొటోషూట్లతో అభిమానులను అలరించే సన్నీ లియోన్, ఈసారి ఎలిగెంట్ లుక్‌తో పాటు ఆధునిక ఫ్యాషన్ శైలిని ప్రదర్శించారు. బాలీవుడ్‌లో తనదైన గుర్తింపు సంపాదించుకున్న ఆమె, సినిమాలతో పాటు టెలివిజన్ కార్యక్రమాలు, ఫ్యాషన్ ఫొటోషూట్ల ద్వారా కూడా ప్రేక్షకులకు చేరువయ్యారు. 'బిగ్‌బాస్' ఐదో సీజన్ ద్వారా భారతీయ టెలివిజన్ ప్రేక్షకులకు పరిచయమైన సన్నీ లియోన్, 'జిస్మ్ 2', 'రాగిణి ఎంఎంఎస్ 2', 'ఏక్ పహేలీ లీలా', 'మస్తీజాదే' వంటి చిత్రాలతో గుర్తింపు పొందారు. 'రాయీస్' చిత్రంలోని 'లైలా మే లైలా' పాట కూడా ఆమెకు విస్తృతమైన ప్రజాదరణను తీసుకొచ్చింది. హిందీ చిత్రాలతో పాటు దక్షిణాది సినిమా రంగంలోనూ ఆమె పలు ప్రాజెక్టుల్లో భాగమయ్యారు. విభిన్నమైన దుస్తుల ఎంపిక, కెమెరా ముందు ఆత్మవిశ్వాసంతో కనిపించే తీరు, ట్రెండ్స్‌కు అనుగుణంగా తన స్టైలింగ్‌ను మార్చుకునే విధానం సన్నీ లియోన్‌ను ఫ్యాషన్ వార్తల్లో తరచూ నిలుపుతున్నాయి. తాజాగా విడుదలైన ఈ ఫొటోల్లోనూ రంగురంగుల సీక్వెన్స్ గౌన్ ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, ఆమె గ్లామరస్ లుక్ ఫ్యాషన్ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ ఫొటోషూట్‌లో సంప్రదాయ అందం కంటే ఆధునిక ఫ్యాషన్‌కు ప్రాధాన్యతనిస్తూ, దుస్తుల డిజైన్‌తోనే ప్రత్యేకమైన గుర్తింపును తీసుకొచ్చారు. సింపుల్ హెయిర్‌స్టైల్, పరిమితమైన యాక్సెసరీలు, ఆకట్టుకునే దుస్తుల కలయికతో సన్నీ లియోన్ మరోసారి తన ఫ్యాషన్ సెన్స్‌ను చాటుకున్నారు.





# నా మాటలను తప్పుగా అర్థం చేసుకున్నారు!

టాలీవుడ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ ప్రస్తుతం తన తాజా చిత్రం 'క్రేజీ కళ్యాణం'తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఈ సినిమా ప్రమోషన్ల సమయంలో ఆమె చేసిన వ్యాఖ్యలు ఇటీవల సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా పెళ్లి, పిల్లల పెంపకం, మహిళల బాధ్యతలు వంటి అంశాలపై ఆమె వ్యక్తం చేసిన అభిప్రాయాలు నెటిజన్ల దృష్టిని ఆకర్షించాయి. అయితే తన వ్యాఖ్యలను కొందరు సందర్భం నుంచి విడదీసి ప్రచారం చేస్తున్నారని అనుపమ తాజాగా స్పష్టం చేశారు. పెళ్లి చేసుకోవద్దని తాను ఎక్కడా చెప్పలేదని, తన మాటల వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని అర్థం చేసుకోవాలని కోరారు. 'క్రేజీ కళ్యాణం' సినిమా విజయోత్సవ కార్యక్రమంలో మాట్లాడిన ఆమె, వివాహం గురించి తాను చేసిన వ్యాఖ్యలపై వస్తున్న ప్రచారానికి వివరణ ఇచ్చారు. గతంలో సీనియర్ నటుడు నరేశ్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో తనను పెళ్లి, పిల్లల గురించి ప్రశ్నించారని అనుపమ తెలిపారు. పెళ్లి చేసుకోకపోయినా పిల్లలను కనవచ్చనే అభిప్రాయంపై స్పందించే క్రమంలో తాను చెప్పిన విషయాలను కొందరు పూర్తిగా వినకుండా, కొంత భాగాన్ని మాత్రమే తీసుకుని సోషల్ మీడియాలో ప్రచారం చేశారని ఆమె అసహనం వ్యక్తం చేశారు. దీంతో తాను పెళ్లికి వ్యతిరేకమనే భావన ప్రజల్లోకి వెళ్లిందని వివరించారు. నిజానికి పెళ్లి చేసుకోవడంలో ఎలాంటి తప్పు లేదని, ఇద్దరు వ్యక్తులు పరస్పర అవగాహనతో సంతోషంగా జీవించడమే వివాహ బంధంలోని ముఖ్యమైన అంశమని అనుపమ అభిప్రాయపడ్డారు. కేవలం పిల్లలు కావాలనే ఉద్దేశంతో పెళ్లి చేసుకుని, ఆ తర్వాత భార్యాభర్తల మధ్య సర్దుబాటు కుదరక విడాకుల వరకు వెళ్లే పరిస్థితులను కూడా సమాజంలో చూస్తున్నామని పేర్కొన్నారు. అలాంటి పరిణామాలు పిల్లల జీవితాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున, తల్లిదండ్రులు కావాలని నిర్ణయించుకునే ముందు తమ పిల్లలకు మంచి, సురక్షితమైన వాతావరణాన్ని అందించగలమా లేదా అనే విషయాన్ని ఆలోచించాలని సూచించారు. పిల్లలను పెంచడం అనేది కేవలం జన్మనివ్వడంతో ముగిసిపోయే బాధ్యత కాదని, వారి భవిష్యత్తు, భావోద్వేగాలు, భద్రతకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె అభిప్రాయపడ్డారు. తన వ్యాఖ్యల ఉద్దేశం ఇదేనని, వివాహ వ్యవస్థను వ్యతిరేకించడం తన ఉద్దేశం కాదని మరోసారి స్పష్టం చేశారు. ఇదే కార్యక్రమంలో ఉన్న నటుడు నరేశ్ కూడా ఈ అంశంపై స్పందించారు. ప్రపంచవ్యాప్తంగా జనాభా తగ్గుదల, మారుతున్న కుటుంబ వ్యవస్థలు, లివ్‌ఇన్ సంబంధాల నేపథ్యంలో తాను గతంలో ఆ వ్యాఖ్యలు చేసినట్లు వివరించారు. వివాహం చేసుకున్నా, వివాహం చేసుకోకుండా కలిసి జీవించినా, పిల్లలను పెంచే విషయంలో బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకోవాలనే ఉద్దేశంతోనే మాట్లాడానని పేర్కొన్నారు. తన వ్యాఖ్యల వల్ల ఎవరికైనా ఇబ్బంది కలిగితే క్షమించాలని కూడా తెలిపారు. దీంతో అనుపమ పెళ్లిపై చేసిన వ్యాఖ్యల చుట్టూ కొనసాగుతున్న చర్చకు తాజా వివరణతో కొంత స్పష్టత వచ్చింది. మరోవైపు, 'క్రేజీ కళ్యాణం' చిత్రంలో అనుపమ కీర్తి అనే పాత్రలో నటించారు. పెళ్లి, కుటుంబ సంబంధాలు, భార్యాభర్తల మధ్య సమానత్వం వంటి అంశాలను వినోదాత్మకంగా చూపించే ఈ చిత్రంలో నరేశ్, తరుణ్ భాస్కర్, అఖిల్ ఉద్దేమరి తదితరులు కీలక పాత్రలు పోషించారు. భద్రప్ప గాజుల దర్శకత్వం వహించిన ఈ సినిమా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ చిత్రంలోని తన పాత్ర ఆలోచనలు, నిజ జీవితంలో తన అభిప్రాయాల మధ్య కొన్ని పోలికలు ఉన్నాయని అనుపమ గతంలో పేర్కొన్నారు. ముఖ్యంగా పెళ్లి అనేది మహిళపై అన్ని ఇంటి బాధ్యతలను మోపే వ్యవస్థగా మారకూడదని, భార్యాభర్తలు ఒకరికొకరు తోడుగా నిలుస్తూ బాధ్యతలను పంచుకోవాలని ఆమె అభిప్రాయపడ్డారు. మహిళలు కూడా ఉద్యోగాలు, వ్యక్తిగత జీవితంలో ఎన్నో బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇంటి పనులు కూడా ఇద్దరూ సమానంగా పంచుకోవడం అవసరమని తెలిపారు. ఈ అభిప్రాయాలు ప్రస్తుతం కుటుంబ సంబంధాలపై జరుగుతున్న చర్చకు మరింత ప్రాధాన్యతను తీసుకొచ్చాయి. ఏదేమైనా, తన వ్యక్తిగత అభిప్రాయాలను పూర్తిగా అర్థం చేసుకోకుండా వివాదాస్పదంగా ప్రచారం చేయవద్దని అనుపమ ఇచ్చిన వివరణ ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ఏడాది పాటు విజయ్‌ను పెళ్లి చేసుకోమని అడిగిన రష్మిక..

టాలీవుడ్ స్టార్ జంట రష్మిక మందన్న, విజయ్ దేవరకొండ తమ ప్రేమ, పెళ్లికి సంబంధించిన ఆసక్తికర విషయాలను తాజాగా పంచుకున్నారు. ప్రముఖ టాక్ షో 'కాఫీ విత్ కరణ్' తాజా ప్రోమోలో వీరిద్దరి మధ్య జరిగిన సరదా సంభాషణ అభిమానులను ఆకట్టుకుంటోంది. పెళ్లి ప్రతిపాదన ఎవరు చేశారనే ప్రశ్నకు విజయ్ స్పందిస్తూ, రష్మికే తనను పెళ్లి చేసుకోవాలని అడిగిందని వెల్లడించాడు. తాను వందసార్లు అడిగావని సరదాగా చెప్పగా, రష్మిక మాత్రం ఏడాది మొత్తం అడుగుతూనే ఉన్నానని నవ్వుతూ చెప్పింది. దీంతో అక్కడ నవ్వులు విరిశాయి. మరో సందర్భంలో తమ మధ్య ఉన్న అనుబంధాన్ని చాటుతూ విజయ్ 'భార్య చెప్పింది అంగీకరించడమే వివాహంలో 101వ నియమం' అంటూ చమత్కరించాడు. ఈ సంభాషణ ప్రస్తుతం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఇటీవల 'రణబాలి' చిత్రంతో తెరపై కలిసి కనిపించిన ఈ జంట, తమ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను పంచుకోవడంతో మరోసారి వార్తల్లో నిలిచింది.



# మహేశ్‌బాబు 'వారణాసి' విడుదల వాయిదా?

సూపర్‌స్టార్ మహేశ్‌బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి కలయికలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'వారణాసి'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా విడుదల తేదీ మారనుందనే ప్రచారం ప్రస్తుతం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రాన్ని 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. అయితే భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్, విజువల్ ఎఫెక్ట్స్, నిర్మాణానంతర పనుల నేపథ్యంలో విడుదల తేదీపై చర్చ మొదలైంది. మహేశ్‌బాబు ఇందులో రుద్ర పాత్రలో కనిపించనుండగా, ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో రాజమౌళి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే సినిమా వాయిదా పడుతుందనే వార్తలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో అభిమానులు విడుదల తేదీపై స్పష్టత కోసం ఎదురుచూస్తున్నారు. అధికారిక ప్రకటన వచ్చే వరకు ఏప్రిల్ 7, 2027నే ప్రస్తుత విడుదల తేదీగా పరిగణించాలి.T




EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034